

కృష్ణా గ్రావిడెజ్

ఒపల్ సుచతా చువాంగ్‌శ్రీ

● పల్లెటూరులో విశ్వసుందరి

గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామంలో విశ్వసుందరి-2025 ఓపల్ సుచతా చువాంగ్‌శ్రీ, ఏషియన్ సుందరి కృష్ణా గ్రావిడెజ్ మంగళవారం సందడి చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణారెడ్డి సతీమణి సుధారెడ్డి నిర్వహణలోని సుధా ఫౌండేషన్, ఎంఈఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ మహిళలకు రొమ్ము కేన్సర్ నిర్ధారణ, ఉచిత పరీక్షల వైద్య శిబిరాన్ని వీరు ప్రారంభించారు. స్థానిక మహిళలతో ముచ్చటించారు.

8

సారథ్యం ఎవరికి?

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో టీడీపీ అధ్యక్షుల ఎన్నికల సందడి

త్వరలో జిల్లా సారథులను ఎంపిక చేయనున్న అధిష్ఠానం

- పాతవారిని కొనసాగిస్తారా? కొత్తవారికి అవకాశం ఇస్తారా?
- పార్టీ బాధ్యతలు నిర్వహించటానికి సిద్ధంగా నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణ
- ఆశావహుల్లో గన్నే వెంకట నారాయణ ప్రసాద్ (అన్న), బూరగడ్డ వేదవ్యాస్




తెలుగుదేశం పార్టీ జిల్లా కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా అధ్యక్షులు ఎవరు అన్నదానిపై చర్చ నడుస్తోంది. ఇప్పటి వరకు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో పార్టీని నడిపిస్తున్న నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణకు నామినేటెడ్ పదవులు రావడంతో కొత్త వారికి అవకాశం ఉంటుందని పలువురు ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణ, గన్నే వెంకట నారాయణ ప్రసాద్ (అన్న), బూరగడ్డ వేదవ్యాస్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే వారికే అధిష్ఠానం అవకాశం ఇస్తుందనే చర్చ నడుస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తెలుగుదేశం పార్టీ జిల్లా కమిటీల ఎన్నికల నేపథ్యంలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు సారథులు ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. గత రెండేళ్లుగా అందరిని సమన్వయం చేసుకుంటూ పనిచేసిన అధ్యక్షులనే మళ్లీ కొనసాగిస్తారా లేక కొత్త వారికి అవకాశం ఇస్తారా? అన్నది చర్చనీయాంశమవుతోంది. ఇప్పటికే గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీల ఎన్నిక పూర్తయింది. జిల్లా కమిటీల ఎన్నికే మిగిలి ఉంది. జిల్లా అనుబంధ కమిటీలు, మిగతా 6లో..

వరించిన నామినేటెడ్ పదవులు

పార్టీ అధ్యక్షులిద్దరికీ ఇటీవలే వారు అందించిన సేవలను దృష్టిలో పెట్టుకుని కీలక నామినేటెడ్ పదవులను అధిష్ఠానం అప్పగించింది. నెట్టెం రఘురాంకు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి, కొణకళ్ల నారాయణరావుకు ఆర్టీసీ చైర్మన్ పదవి కట్టబెట్టింది. మళ్లీ జిల్లా పార్టీ అధ్యక్షులుగా సేవలు అందించటానికి ఇద్దరూ సుముఖంగానే ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల జిల్లా స్థాయి నాయకులు మళ్లీ అధ్యక్షులుగా మీరే కొనసాగాలంటూ ఇద్దరు నేతలను కోరినట్టు సమాచారం. పార్టీ అధిష్ఠానం దృష్టికి కూడా లేఖల రూపంలో తమ అభిప్రాయాలను తెలుపుతున్నారు. ఈ క్రమంలో జోడు పదవులను నిర్వహించటానికి వారు ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. మరి అధిష్ఠానం ఆలోచనలు ఎలా ఉన్నాయన్నది ముఖ్యమైన అంశం. ప్రజా ప్రతినిధులుగా ఉండే వారు పార్టీ నిర్మాణానికి పెద్దగా కృషి చేయలేని పరిస్థితి ఉంటుంది. పార్టీని సంస్థాగతంగా నిర్మించాలంటే.. పూర్తి స్థాయిలో పనిచేయగలిగేవారినే తీసుకోవాలన్నది అధిష్ఠానం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది. విపక్షాల వ్యూహాలకు తగినట్టుగా రాజకీయ తంత్రాలతో పార్టీని ముందుకు తీసుకువెళ్లగలిగే వారు అవసరమన్నది అధిష్ఠానం ఆలోచనగా తెలుస్తోంది.

ఎనికేపాడులో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్



నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎనికేపాడులో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రారంభించనున్నారు. అమరావతి నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టీజీ భరత్ తదితర మంత్రులతో కలిసి దీనిని చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభిస్తారు. టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. స్టార్టప్స్‌కు మౌలిక సదుపాయాలు అందించడంతో పాటు మార్గదర్శకం చేయడం, ఆర్థిక వనరులు సమకూర్చడం వంటివి ఈ హబ్ ద్వారా జరుగుతాయి. ముఖ్యంగా టెక్నాలజీ, హెల్త్‌కేర్ రంగాలపై ఈ హబ్ దృష్టి సారిస్తుంది.

లంకల్లో కలవరం!

ప్రకాశం బ్యారేజీ నుంచి 4.66 లక్షల క్యూసెక్కుల విడుదల

ప్రకాశం బ్యారేజీ నుంచి లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో కృష్ణమ్మ కడలివైపు పరుగులు తీస్తోంది. పులిగడ్డ అక్విడెక్టు వద్ద ప్రమాదకర స్థాయిలో ప్రవాహం సాగడం, మరో ఏడు లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉండటంతో లంక గ్రామాల్లో కలవరం మొదలైంది. గంట గంటకు పెరుగుతున్న వరద ఉధృతితో నదీతీర ప్రాంతాలు, లంకలకు ముప్పు పొంచి ఉంది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. నాగాయలంక, తోట్ల వల్లూరు మండలాల్లో కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ పర్యటించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు.

- పులిగడ్డ అక్విడెక్టును తాకుతూ కడలివైపు పరుగులు
- మరో ఏడు లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం
- నదీ తీర గ్రామాలు, లంకలకు పొంచి ఉన్న ముప్పు
- నాగాయలంక, తోట్లవల్లూరు మండలాల్లో పర్యటించిన కలెక్టర్, జేసీ
- వరద ఉధృతి, పునరావాస కేంద్రాల ఏర్పాటుపై ఆరా
- అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం



పులిగడ్డ అక్విడెక్టును తాకుతూ ప్రవహిస్తున్న వరదనీరు



నాగాయలంక మండలం గొల్లమందకు వెళ్లే రహదారిని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కృష్ణానదికి ఎగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టులు, ఉపనదుల నుంచి భారీగా వరద నీరు రావడంతో మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి ప్రకాశం బ్యారేజీ నుంచి 4.66 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. దీంతో నదీతీర ప్రాంతాలు, లంక గ్రామాల్లోని ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. వరద ఉధృతి పెరిగిన నేపథ్యంలో కలెక్టర్ బాలాజీ నాగాయలంక మండలంలో అధికారులతో కలసి పర్యటించారు. వరద పరిస్థితులు, అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఎదురుమొండి-గొల్లమంద మిగతా 6లో..

కొంచెం ఇష్టం కొంచెం కష్టం

- ఐవీఆర్ఎస్ తాజా సర్వే విడుదల
- శాఖల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ
- రెవెన్యూ, సర్వే, విద్యుత్, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై జనాగ్రహం
- ఉచిత ఇసుక, సామాజిక పింఛన్ల పంపిణీపై సానుకూలం

6

ఏరు దాటాలంటే పడవలే శరణ్యం

- పాత ఎడ్లంక వద్ద ప్రజల అవస్థలు

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

రాష్ట్ర మహిళలకు రోజుకు రూ.6.32 కోట్ల లబ్ధి

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ● అవనిగడ్డ, చల్లపల్లి బస్‌స్టేషన్ల సందర్శన

అవనిగడ్డ/చల్లపల్లి/మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రోజుకు రూ.6.32 కోట్ల విలువైన టికెట్లను మహిళలకు ఉచితంగా అందిస్తుందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకానికి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. మంగళవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం కె.వెంకటేశ్వర్లుతో కలిసి అవనిగడ్డ బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకాన్ని రోజుకు సుమారు 18 లక్షల మంది మహిళలు వినియోగించుకుంటున్నారని తెలిపారు. అనంతరం బస్‌స్టేషన్‌లోని సమస్యలపై ఆరా తీశారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని చెప్పారు. బస్సుల వద్ద తోపులాటలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెనుమూడి సాయిబాబు, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ మిగతా 6లో..



మచిలీపట్నంలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు చురుగ్గా ఏర్పాట్లు

- ఉమ్మడి జిల్లాలో 1,208 టీచర్ పోస్టుల భర్తీ
- మచిలీపట్నం నోబుల్ కళాశాలలో అభ్యర్థుల సర్టిఫికెట్‌ల పరిశీలన

మచిలీపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం పంపారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, రెవెన్యూ శాఖ అధికారులతో ప్రత్యేక బృందాలను కలెక్టర్ నియమించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ ద్వారా ఉద్యోగం పొందేందుకు అర్హత సాధించిన వారు ప్రభుత్వం ప్రకటించిన మిగతా 6లో..

ఉమ్మడి జిల్లాలో 1,208 పోస్టులు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లాలో 1,208 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతులు ఇచ్చారు. ఈ పోస్టుల కోసం 67,470 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఈ నెల 12వ తేదీన అభ్యర్థుల మార్కులను విడుదల చేశారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) 663 పోస్టులు, సెకండరీ గ్రేడ్ టీచర్‌లు (ఎస్‌జీటీ) 545 పోస్టులను, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో మరో ఐదు పోస్టులను భర్తీ చేయనున్నారు.

వరదను ఒడిసి పట్టేద్దాం..



పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ అందాలను వీక్షించేందుకు తరలిరావడంతో ప్రకాశం బ్యారేజీ జనం కిక్కిరిసింది. కృష్ణా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహం కొనసాగుతున్న విషయం తెలిసిందే. సాగరుడిలో మమేకమయ్యేందుకు ఉరకలు వేస్తూ కృష్ణమ్మ పరవళ్లు మహాద్భుతం. బ్యారేజీ వద్ద ఏడాదికి ఒకటి, రెండుసార్లు మాత్రమే ఆవిష్కృతమయ్యే ఈ సుందర దృశ్యాన్ని చూసేందుకు జనం ఆసక్తి చూపుతారు. మూడురోజులు వరుస సెలవులు కావడంతో విజయవాడ, మంగళగిరితో పాటు ఇతర ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. దుర్గమ్మ సన్నిధి నుంచి రెండు కొండల నడుమ ఆహ్లాదకర వాతావరణంలో పోటెత్తుతున్న కృష్ణమ్మ చూసి జనం తరిస్తున్నారు.

(విజయవాడ సిటీ-ఆంధ్రజ్యోతి)

- వరద చూసేందుకు జనం ఆసక్తి
- సందర్శకులతో కిక్కిరిసిన వంతెన





పవిత్రసంగమం వద్ద కృష్ణానది పరవళ్లు

నిలకడగా వరద!

- పవిత్రసంగమం వద్ద 5 లక్షల క్యూసెక్కులు
- 6 లక్షలు దాటితే చినలంక, పెద్దలంకకు ముంపు ముప్పు
- పలుచోట్ల పునరావాస కేంద్రాల ఏర్పాటు
- వరద పరిస్థితిని పర్యవేక్షిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి కృష్ణమ్మకు వరద పోటెత్తింది. ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్ద మంగళవారం సాయంత్రానికి సుమారు 5 లక్షల క్యూసెక్కులకు చేరుకుంది. స్నాన ఘాట్ మెట్లపైకి నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పర్యాటకులను నీటిలోకి వెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. వరద 6 లక్షలు దాటితే చిన్నలంక, పెదలంకతో పాటు ఏటిపట్టు గ్రామాలు ముంపుబారిన పడే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తగా అధికారులు ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్, ఎ.కాలనీ ఆడిటోరియం, మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల, కాచవరం కమ్యూనిటీహాల్, కొండపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరద పరిస్థితిని తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు పరిశీలించారు. వరద తగ్గే వరకు లంక, ఏటిపట్టు గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.



పాత ఎడ్లంక వద్ద పడవ ప్రయాణం, పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద వరద

ఏరు దాటాలంటే పడవలే శరణ్యం..

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నదీగర్భంలో ఉన్న పాత ఎడ్లంక గ్రామానికి వివిధ పనులపై అవనిగడ్డ వచ్చేవారు పడవ ద్వారానే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. కృష్ణానదికి వరద పోటెత్తడంతో తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పడవను ఏర్పాటుచేశారు. కాగా ప్రతీరోజు విద్యార్థులు అవనిగడ్డ ఉన్నత పాఠశాలకు రావాలన్నా, పనుల నిమిత్తం వచ్చే వారికి సైతం ఈ పడవే శరణ్యమైంది.. ప్రకాశం బ్యారేజీ నుంచి దాదాపు 5లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువ ప్రాంతానికి చేరుతుండటంతో ప్రస్తుతం పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది. మరో రెండురోజులపాటు వరద ప్రవాహం కొనసాగుతుందని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా ప్రణాళిక రూపొందించినట్టు అధికారులు తెలిపారు.



తోట్లవల్లూరు బాడవలో కుళ్లిన వరినాట్లు

వందెకరాల్లో కుళ్లిన వరినాట్లు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు బాడవలో వరినాట్లు కుళ్లిపోయాయి. సుమారు వందెకరాల్లో వరినాట్లు ముంపు వల్ల పాడైపోయాయని రైతులు తెలిపారు. ఈనెల 13న కురిసిన భారీ వర్షానికి బాడవలోని వరినాట్లు మోకాటిలోతు నీటిలో ముంపునకు గురయ్యాయి. నేటికీ చాలామంది రైతుల పొలాల్లో మురుగు నిలిచి ఉండటంతో వరినాట్లు కోలుకునే పరిస్థితి లేదంటున్నారు. మళ్లీ నాట్లు వేసుకోవాలన్నా సాధ్యమయ్యే పరిస్థితి లేదని, ప్రభుత్వం పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్‌కార్డు చూపుతున్న మంత్రి మనోహర్ (ఫైల్)

మొగల్రాజపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రైస్‌కార్డుల స్థానంలో కూటమి ప్రభుత్వం కొత్తగా తెచ్చిన స్మార్ట్ కార్డులు జిల్లాకు మరో రెండు రోజుల్లో రానున్నాయి. ఈ నెల చివరివారం నుంచి కార్డుదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రైస్ కార్డులకు భిన్నంగా ఈసారి క్యూఆర్‌కోడ్‌తో ఉన్న కార్డులు వస్తున్నాయి. జిల్లాలో 957 రేషన్ షాపుల పరిధిలో 5,90,933 కార్డులున్నాయి. కొత్తగా ఇవ్వన్న స్మార్ట్ కార్డులను చెన్నైలో ఓ సంస్థకు ప్రింటింగ్ నిమిత్తం అప్పగించారు. అక్కడ ప్రింటింగ్ పూర్తయిన కార్డులు మంగళవారం జిల్లాకు చేరాయి. ఈ కార్డులను సచివాలయాల, రేషన్‌షాపుల వారీగా పంపిణీ చేయనున్నారు. జిల్లా నుంచి నాలుగురోజుల్లో మండలాలకు పంపుతారు. ఈ కార్డులో కుటుంబయజమానిపేరు ఫోటోతో మాత్రమే ఉంటుంది. నేతల ఫోటోలు, పార్టీ రంగులు ఉండవు.



మండల పరిషత్ కార్యాలయం వద్ద తొలగించబడిన పింఛన్‌దారులు

అన్యాయంగా తొలగించారు.. న్యాయం చేయరూ!

- ఎంపీడీవోకు సదరం పింఛన్ లబ్ధిదారుల వేడుకోలు

మోపిదేవి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లలో అనర్హులను తొలగించటంతో వారంతా మండల పరిషత్ కార్యాలయం, సచివాలయాల వద్దకు క్యూ కడుతున్నారు. మోపిదేవి మండలంలో 453 మందిని అనర్హులుగా గుర్తించి తొలగించగా, వారంతా మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. మంగళవారం మోపిదేవి, పెదకళ్లేపల్లి, పెదప్రోలు, ఉత్తరచిరువోలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు తమను అన్యాయంగా తొలగించారని.. న్యాయం చేయాలని ఎంపీడీవో స్వర్ణభారతిని వేడుకున్నారు. అర్హత ఉన్నా తొలగిస్తే సంబంధిత ధృవీకరణ పత్రాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎంపీడీవో లబ్ధిదారులకు సూచించారు. సచివాలయాల్లో ఆన్‌లైన్‌చేసిన అనంతరం జిల్లా అధికారులు సదరం క్యాంపు నిర్వహించే తేదీ తెలియజేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా మోపిదేవి పంచాయతీ శివారు గంజివానిపాలెం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు పుట్టు, మూగ, చెవుడు కలిగి ఉన్నప్పటికీ పింఛన్ తొలగించారని, న్యాయం చేయాలంటూ ఎంపిడివోను కోరారు.

ప్రభుత్వ అధికారుల పనితీరు కాస్త మెరుగుపడాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రజలు కోరుతున్నారు. మెరుగైన వసతులు కల్పించడంలో వెనుకబడి, అవినీతిలో కొన్ని శాఖలు ముందుంటున్నాయనే అభిప్రాయం జిల్లా ప్రజల నుంచి వినిపిస్తోంది. పరస్పర ప్రజా స్వరం ప్రతిస్పందన వ్యవస్థ(ఇంటరాక్టీవ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్-ఐవీఆర్ఎస్) తాజాగా జిల్లాలోని తొమ్మిది శాఖల పనితీరుపై నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వే ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. కొన్ని శాఖల పనితీరు కాస్త మెరుగ్గానే ఉన్నా.. మరి కొన్నింటి పనితీరు ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని ఈ సర్వే చెబుతోంది. ఆ జాబితా వివరాలు కింది విధంగా ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

- ఐవీఆర్ఎస్ తాజా సర్వే విడుదల
- శాఖల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ
- రెవెన్యూ, సర్వే, విద్యుత్, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై జనాగ్రహం
- ఉచిత ఇసుక, సామాజిక పింఛన్ల పంపిణీపై సానుకూలం



కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం

రెవెన్యూ, సర్వే, విద్యుత్, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై ప్రజాగ్రహం

- పాస్ పుస్తకాల మంజూరుపై 435 మంది రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం సేకరించింది. విచారణ కోసం వీఆర్వో ముందుగానే మీకు సమాచారం ఇచ్చారా? అని అడిగిన ప్రశ్నలకు 58 శాతం అవును అని, 42 శాతం లేదు అని సమాచారం ఇవ్వగా కార్యాలయంలో ఇబ్బందులు తలెత్తాయని 45శాతం తెలిపారు.
- రెవెన్యూ అధికారుల అవినీతిని 26శాతం రైతులు బహిర్గతం చేశారు. భూమి సర్వేకు సంబంధించి 76 మంది అభిప్రాయాలను సేకరించగా, సర్వేయర్లు డబ్బులు అడుగుతున్నారని 30మంది రైతులు ప్రభుత్వానికి చెప్పారు. భూమి వద్దకు సర్వే చేయడం లేదని 58 మంది రైతులు వెల్లడించారు. దీన్ని బట్టి సర్వేయర్లు గూగుల్ సాయంతో కార్యాలయంలో కూర్చునే సర్వే చేస్తున్నట్టు రుజువైంది.
- విద్యుత్‌శాఖకు సంబంధించి 50,202 మందిని సర్వే చేస్తే లో వోల్టేజీ సమస్య ఉంటుందని 51 శాతం మంది చెప్పగా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని 34 శాతం మంది చెప్పారు. విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని 30 శాతం మంది వివరించారు.
- గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 430మంది లబ్ధిదారులను సర్వేచేస్తే.. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు అందుబాటులో ఉండటం లేదని, నిర్మాణ సమయంలో సహకారం అందించడం లేదని 50 శాతం చెప్పారు. బిల్లుల చెల్లింపులోనూ ఇబ్బందులు పెడుతున్నారని మరో 50శాతం మంది ప్రభుత్వానికి వివరించారు.

వైద్య ఆరోగ్య, దేవదాయ శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పనితీరు కాస్త మెరుగుపడాలి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ), పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యుపీహెచ్‌సీ)ల పనితీరుపై 6,868 మందిని ప్రభుత్వం సర్వే చేసింది. డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని 24 శాతం, రక్త పరీక్షలు చేయడం లేదని 31 శాతం, మందులు ఇవ్వడం లేదని 26 శాతం, వైద్య సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని 23 శాతం మంది చెప్పారు.
- దేవదాయశాఖ పనితీరుపై 24,648మందిని సర్వే చేస్తే.. దేవాలయాల్లో దైవ దర్శనం సంతృప్తికరంగా లేదని 26శాతం, తాగునీరు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం నిర్వహణ సక్రమంగా లేదని 34 శాతంమంది భక్తులు వివరించారు.
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సేవలపై 16 మందిని సర్వేచేస్తే.. లైసెన్స్ పొందే ప్రక్రియలో ఇబ్బందులు పెడుతున్నారని 29శాతం మంది చెప్పారు.

ఉచిత ఇసుక, సామాజిక పింఛన్ భేష్

ఉచిత ఇసుక విధానంపై 100 మందిని సర్వే చేస్తే.. తగినంత పరిమాణంలో ఇసుక వస్తుందని 78 శాతం చెప్పగా, ఇంటి వరకు చేర్చిన ధరతో 68 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన 32 శాతం ధర పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

- సామాజిక పింఛన్‌లపై 12,898 మందిని సర్వే చేస్తే.. ఇంటి వద్దకే వచ్చి పింఛన్ నగదు ఇస్తున్నారని 91 శాతం మంది చెప్పారు. అధికారి ప్రవర్తన బాగుందని 87 శాతం మంది చెప్పారు. అయితే పింఛన్ పంపిణీ చేసిన అధికారి డబ్బులు వసూలు చేస్తున్నారని 8.79 శాతం మంది చెప్పగా, డబ్బులు అడగటం లేదని 91.21 శాతం మంది ప్రభుత్వ సర్వేలో వెల్లడించారు.



డాబా కొట్లు సెంటర్‌లో అధికారులు ఏర్పాటు చేసిన బోట్లు

ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు..

- అజిత్‌సింగ్‌నగర్‌కు పడవల తరలింపు

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీకి నీటి ప్రవాహం పెరగనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాలకు మంగళవారం రాత్రి పడవలను తరలించారు. బుడమేరు ప్రవాహం సాధారణంగానే ఉందని, అయితే బ్యారేజీ వద్ద వరద ఉధృతి పెరగుతుండటంతో స్థానిక డాబాకొట్లు, పైపుల రోడ్డు, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాలకు పడవలను తరలించారు. పడవల తరలింపుతో గత ఏడాది అనుభవాలతో స్థానిక ప్రజలు వదంతులకు బెంబేలెత్తిపోతున్నారు.

ఆందోళన వద్దు : ఎమ్మెల్యే ఉమా

వరద వదంతుల నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. అజిత్ సింగ్‌నగర్ వద్ద బోట్లు కేవలం ముందస్తు చర్యగా అధికారులు సిద్ధం చేశారు. బుడమేరు ముంపునకు.. బోట్ల తరలింపునకు సంబంధం లేదు.. ప్రజల శ్రేయస్సు కోసమే ముందస్తు చర్యలు.

అన్నివర్గాలు కలిస్తేనే

పేదరిక నిర్మూలన

- డీఈవో సుబ్బారావు

విజయవాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పేదరికాన్ని నిర్మూలించడంలో భాగంగా 'జీరో ప్రావర్టీ' భావనను ముందుకు తీసుకెళ్లడానికి పీ-4 ద్వారా అన్ని వర్గాలు కలిసి పనిచేయాల్సిన అవసరముందని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు పేర్కొన్నారు. విజయవాడ అర్బన్, రూరల్ మండలాల ప్రైవేటు పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్‌తో కలిసి మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పీ-4 సమావేశాన్ని నిర్వహించారు. పిల్లల విద్యతో పాటు కుటుంబాల స్థితి మెరుగుపడితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని డీఈవో అన్నారు. పీ-4 మోడల్‌లో భాగంగా ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజలు కలిసి పనిచేస్తే వికసిత్ భారత్- 2047 సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి పాఠశాల ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పేద కుటుంబాలను దత్తత తీసుకుని విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల విషయంలో సహకరించాలని కోరారు. ఆర్డీవో చైతన్య మాట్లాడుతూ, పాఠశాలలు కేవలం విద్య అందించడమే కాకుండా సమాజ అభివృద్ధిలో భాగమవ్వాలన్నారు. ప్రైవేటు పాఠశాలల మేనేజ్‌మెంట్ సమాజంలో సామాజిక బాధ్యతలో భాగంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఆయన కోరారు. విద్య, ఆరోగ్య, ఉపాధి వంటి అంశాల్లో పేదకుటుంబాలకు సహకారం అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాలో అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న 10 సంవత్సరాల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు ఉత్తమ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో యూవీ సుబ్బారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 5న గురుపూజోత్సవం సందర్భంగా ప్రదానం చేసే అవార్డులకు జిల్లా వ్యాప్తంగా అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందని, ఎలాంటి నేరారోపణ, క్రిమినల్ కేసులు, ఇతర ఏ అభియోగాలు లేనివారు మాత్రమే అర్హులని డీఈవో తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి



పమిడిముక్కల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గురజాడలో సోమవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై బాలుడు మృతిచెందాడు. పమిడిముక్కల పోలీసుల వివరాల ప్రకారం.. గురజాడ గ్రామానికి చెందిన కాండ్రు హర్షవర్ధన్(12) గ్రామంలో బంధువుల వివాహానికి వెళ్లి అక్కడ టెంట్‌కు ఉన్న ఇనుప పైపు పట్టుకుని విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేసి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. హర్షవర్ధన్ ప్రత్యేక అవసరాలు కలిగిన బాలుడు(దివ్యాంగుడు) కాగా తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు.

సారథ్యం ఎవరికి?

(5వ పేజీ తరువాయి)

జిల్లా కమిటీల ఎన్నిక నిర్వహించాలని అధిష్టానం కూడా ఆదేశించటంతో.. ప్రస్తుతం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలో దీనికి సంబంధించిన కసరత్తు ప్రారంభమైంది. జిల్లా అధ్యక్షులు ఎవరన్నది అధిష్టానం ఎంపిక చేసే అవకాశం కనిపిస్తోంది. అధిష్టానం ఎంపిక చేసిన అభ్యర్థులకు సంబంధించి ప్రజా ప్రతినిధుల అభిప్రాయం కూడా తీసుకునే అవకాశం ఉంది. జిల్లా పార్టీని నడిపించే రథసారథులు కావడంతో ప్రజా ప్రతినిధుల అభిప్రాయం ఎలా ఉన్నా.. అధిష్టానం మాత్రం పార్టీ బలోపేతం ప్రధానంగా నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మరికొద్ది రోజుల్లో రెండు జిల్లాల్లో పార్టీ అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. పార్టీ జిల్లా అధ్యక్ష ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ తమ దృష్టిలో ఉన్న వారి పేర్లను పేర్కొంటూ అభిప్రాయ సేకరణ జరిపే అవకాశం ఉంది. గతంలో చాలా సందర్భాలలో ఈ విధానాన్ని అధిష్టానం పాటించింది.

సౌమ్యంగా పార్టీని నడిపించిన నెట్టెం, కొనకళ్ల

ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా నెట్టెం రఘురాం, కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా కొనకళ్ల నారాయణ రావు ఉన్నారు. వీరిద్దరికి సౌమ్యులుగా ముద్ర ఉంది. ఎవరినీ నొప్పించకుండా పార్టీని ముందుకు తీసుకువెళ్లారు. వీరితో ఎవరికీ ఇబ్బందులు లేవు. రెండేళ్లుగా నాయకత్వంపై అసంతృప్తులు కానీ, వర్గ విభేదాలు కానీ రాకుండా చూడటంలో కీలక పాత్ర పోషించారు. అధిష్టానానికి విధేయులుగా ఉంటూ పార్టీని సమన్వయంతో ముందుకు నడిపించారు. జిల్లా పార్టీ అధ్యక్షులుగా పెత్తనం చలాయించలేదన్న అభిప్రాయం పార్టీ నాయకులలో ఉంది. జిల్లా పార్టీ నాయకులుగా ఉండే వారు కొన్ని సందర్భాలలో ప్రజా ప్రతినిధులను కూడా లీడ్ చేసే విధంగా ఉండాలి. వారు చెప్పినట్టు తలాడించేలా ఉండకూడదన్నది కార్యకర్తల అభిప్రాయంగా ఉంది. రెండు జిల్లాల పార్టీల అధ్యక్షులు ప్రజా ప్రతినిధులకు తలవంచిన సందర్భాలు ఎక్కడా లేనప్పటికీ ప్రజా ప్రతినిధుల విషయంలో గతంలో ఉమ్మడి కృష్ణా జిల్లాకు అధ్యక్షులుగా పనిచేసిన వారి తరహాలో వ్యవహరించలేదన్న కార్యకర్తల అభిప్రాయం కూడా పరిగణనలోకి తీసుకోదగిన విషయమే.

రేసులో గన్నే, బూరగడ్డ

రెండు జిల్లాల్లో సీనియర్ నాయకులు రథసారథుల పదవులను ఆశిస్తున్నారు. వీరిలో ప్రధానంగా ఎన్టీఆర్ జిల్లాలో గన్నే వెంకట నారాయణ ప్రసాద్ (అన్న), కృష్ణాజిల్లాలో బూరగడ్డ వేదవ్యాస్ ఉన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నపుడు విజయవాడ అర్బన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష స్థానానికి గన్నే తీవ్ర స్థాయిలో పోటీ పడ్డారు. అప్పట్లో బుద్దా వెంకన్న, గన్నే మధ్యన తీవ్ర స్థాయిలో పోటీ నడిచింది. దీంతో అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించింది. ఐవీఆర్ఎస్ సర్వేలో కూడా ఇద్దరికీ సమానంగా అభిప్రాయం రావటంతో అధిష్టానానికి ఎంపిక సంక్లిష్టంగా మారింది. అప్పట్లో బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో గన్నేకు అవకాశం ఇవ్వలేదు. బుద్దా వెంకన్నను అర్బన్ పార్టీ అధ్యక్షుడిగా ప్రకటించటడం జరిగింది. గన్నేకు రాష్ట్ర కార్యదర్శి పదవిని ఇచ్చి అసంతృప్తిని చల్లార్చారు. గన్నే గత ఎన్నికలలో మైలవరం సీటును ఆశించి అక్కడ కార్యాలయాన్ని ప్రారంభించి కార్యకలాపాలు నిర్వహించారు. వసంత కృష్ణప్రసాద్‌కు సీటు ఇవ్వటంతో ఆయన గెలుపునకు కృషి చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో పూర్వ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు దేవినేని ఉమామహేశ్వరరావు, అర్బన్ మాజీ అధ్యక్షుడు బుద్దా వెంకన్నలు పార్టీ నాయకత్వ బాధ్యతల విషయంలో ఆసక్తిగా లేరని తెలుస్తోంది. దీంతో ఎన్టీఆర్ జిల్లా నుంచి గన్నే మాత్రమే జిల్లా పార్టీ అధ్యక్షుని రేసులో ఉన్నారు. కృష్ణాజిల్లా నుంచి మాజీ డిప్యూటీ స్పీకర్, పెడన (పాత మల్లేశ్వరం) మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్ కూడా జిల్లా పార్టీ అధ్యక్ష రేసులో ఉన్నారు.

లంకల్లో కలవరం!

(5వ పేజీ తరువాయి)

దీవులకు వెళ్లే రహదారి వరద ఉధృతి కారణంగా 700 మీటర్ల మేర కొట్టుకుపోవడంతో అధికారులు ఈ రహదారి బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు బుధవారం నాటికి ఆరు లక్షల నుంచి ఏడు లక్షల క్యూసెక్కుల వరకు వరద నీటిని వదిలే అవకాశం ఉందన్నారు.

వరద పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసినట్లు తెలిపారు. వరద మరింతగా పెరిగితే లంక గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పడవలను సిద్ధం చేశామన్నారు. పునరావాస శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. జేసీ గీతాంజలిశర్మ తోట్లవల్లూరు మండలంలో పర్యటించి వరద పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తోట్లవల్లూరు, పెనమలూరు మండలాల్లోని లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆమె ఆదేశించారు. లంక గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

పులిగడ్డ అక్విడెక్టును తాకిన వరద

ప్రకాశం బ్యారేజీ నుంచి 4.66 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి వరద ప్రవాహం మరింతగా పెరిగింది. పులిగడ్డ అక్విడెక్టును తాకుతూ ప్రమాదకరస్థాయిలో వరదనీరు ప్రవహిస్తోంది. అవనిగడ్డ మండలం యడ్లలంకకు వెళ్లే రోడ్డు గతంలో వచ్చిన వరద నీటి ప్రవాహం కారణంగా కొట్టుకుపోయింది. మళ్లీ భారీస్థాయిలో వరద వస్తుండటంతో ఈ రోడ్డు మరింతగా కోతకు గురవుతోంది. నాగాయలంక మండలంలోని ఎదురుమొండి, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ తదితర గ్రామాల వద్ద కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది.

22వ తేదీ వరకు వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కోస్తాతీరం వెంబడి ఈ నెల 22వ తేదీ వరకు ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. వాయుగుండం ప్రభావంతో మచిలీపట్నంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఒకమోస్తరు, తేలికపాటి వర్షం కురిసింది.

రాష్ట్ర మహిళలకు రోజుకు రూ.6.32 కోట్ల లబ్ధి

(5వ పేజీ తరువాయి)

కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, చల్లపల్లి బస్‌స్టేషన్‌లో కూడా నారాయణ పర్యటించారు. మహిళలు, కళాశాల విద్యార్థినులతో మాట్లాడి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఎలా ఉందంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఉచిత బస్సు ప్రయాణంపై సంతోషం వ్యక్తం చేశారు. బస్‌పాస్‌లు లేకుండా ప్రయాణించే సౌకర్యం కల్పించడంపై ప్రభుత్వానికి విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఎంపీటీసీలు పైడిపాముల స్వప్న, మాలెంపాటి శ్రీనివాసరావు, షేక్ నబీఘోరి, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు పాల్గొన్నారు. మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లోని మహిళా ప్రయాణికులతో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ కొద్దిసేపు మాట్లాడారు. ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనకు చురుగ్గా ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

తేదీన సర్టిఫికెట్‌ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉందని డీఈవో పీవీజే రామారావు తెలిపారు. మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్‌ల పరిశీలన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, ఇందుకు 40 గదుల వరకు కావాల్సి ఉందని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయిన వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన కసరత్తును పూర్తి చేసే నిమిత్తం డీఈవో కార్యాలయం నుంచి కొందరు అధికారులను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి మంగళవారం పిలిపించారు.

నీట్ పీజీలో ఆలిండియా ర్యాంకులు



పి.అన్విత



ఎస్.కిరణ్మయి

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందు పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ కుమార్తె అన్విత ఎయిమ్స్ నిర్వహించిన నీట్ పీజీ ఫలితాల్లో ఆలిండియా ర్యాంక్ 202 సాధించింది. విజయవాడ ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన అన్విత బెస్ట్ గోయింగ్ విద్యార్థినిగా పురస్కారం పొందింది. ఈ సందర్భంగా మిత్రులు, లయన్స్ క్లబ్ నేతలు, అన్వితకు అభినందనలు తెలిపారు.

ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడికి చెందిన సబ్బినేని కిరణ్మయి ఆలిండియా 379 ర్యాంకు సాధించింది. 2018 ఎంబీబీఎస్‌లో 330ర్యాంకు సాధించి గుంటూరు మెడికల్ కళాశాలలో 2018-24 వరకు యూజీ చేసిన ఆమె సొంతగా ఇంటి వద్దే చదివి ఆలిండియా ర్యాంక్ సాధించడం విశేషం. ఈ మేరకు ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

సురక్షిత తాగునీరందించేలా చర్యలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని ప్రజలకు సురక్షిత తాగు నీరందించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో త్రినాద్ తెలిపారు. కాకులపాడులో ఓవర్ హెడ్ ట్యాంకు పరిసరాలతో పాటు ట్యాంకు శుభ్రపరచే తేదీలతో కూడిన రికార్డులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి చెత్తసేకరణ తీరును పరిశీలించారు. వర్షాలు పడుతున్నందున ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్షపునీరు నిలువ ఉండకుండా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి విషయంలో ఎటువంటి ఫిర్యాదులున్నా తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ఈ రోడ్లు బంద పెట్ట!

- బురదమయంగా పేదల కాలనీ రోడ్లు
- చినుకుపడితే చాలు నీట మునుగుతున్న కాలనీలు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న లబ్ధిదారులు

ఉంగుటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇళ్ల పథకంలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం మండలంలోని పలు గ్రామాల్లో ఊరిగా దూరంగా లేఅవుట్లు వేసి, కనీస వసతులు లేకుండా, మెరకచేయకుండా లోతట్టు ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చింది. అప్రోచ్ రోడ్లు, అంతర్గత రహదారులు అభివృద్ధి చేయకుండా అప్పట్లో అధికార యంత్రాంగం లబ్ధిదారులపై ఒత్తిడి తేవడంతో ఇళ్లు నిర్మించుకున్నారు. ఆత్కూరు, తేలప్రోలు, మానికొండ, ఇందుపల్లి, కొయ్యగూరపాడు, వేంపాడు, నాగవరప్పాడుల్లో పల్లపు పొలాల్లో వేసిన లేఅవుట్లలో కాస్త చినుకుపడితే చాలు కాలనీలు నీట మునుగుతున్నాయి. అంతర్గత రహదారులన్నీ బురదమయంగా మారడంతో సదరు రోడ్లపై రాకపోకలు సాగించలేక లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. కాగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది.



మానికొండ పేదల కాలనీలో రోడ్ల దుస్థితిని పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం బృందం

మానికొండ లేఅవుట్‌లో పర్యటించిన వ్యవసాయ కార్మిక సంఘం బృందం

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకుల బృందం మంగళవారం మానికొండ లేఅవుట్‌లో పర్యటించింది. సదరు పేదల కాలనీలో మొత్తం 450 ఇళ్లస్థలాలు ఇవ్వగా, అందులో సుమారు 300కు పైగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. అంతర్గత రోడ్ల అభివృద్ధిపై గత ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ఒక మోస్తరు వర్షానికే కాలనీలో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయని, సైకిళ్లు, బైక్‌లు బురదలో కూరుకుపోయి ముందుకు కదలడంలేదని, చిత్తడి రోడ్లపై రాకపోకలు సాగించలేక నరకయాతన అనుభవిస్తున్నామని కాలనీవాసులు బృందానికి తమ గోడును చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, మేకల పార్వతీశ్వరరావు, కిరణ్, రహమ్మతున్నీసా, రాము, సూరి, బేగం, ఖాదర్‌బాషా, దాసు తదితరులు పాల్గొన్నారు.



కొయ్యగూరపాడులో బురదమయంగా కాలనీకి వెళ్లే రోడ్డు

గన్నవరం విమానాశ్రయంలో మెరిసిన ప్రపంచ సుందరీమణులు

గన్నవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరీమణులు ఒపల్ సుచతా చువాంగ్‌శ్రీ, కృష్ణా మేరి గ్రావిడెజ్‌లు గన్నవరంలో మెరిశారు. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులో ఏర్పాటు చేసిన క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి మంగళవారం మధ్యాహ్నం విచ్చేశారు. సుందరీమణులకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంఈఐఎల్ అధినేత పీవీ కృష్ణారెడ్డి సతీమణి, ఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బ్యూటీ విత్ ఏ పర్పస్ గ్లోబల్ అంబాసిడర్ పి.సుధారెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన డోకిపర్రు వెళ్లారు. మిస్ వరల్డ్, మిస్ ఏషియా రావడంతో విమానాశ్రయంలో సందడి వాతావరణంలో నెలకొంది.



గన్నవరం జట్టుకు షీల్డ్, నగదు బహుమతి అందజేస్తున్న లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు

ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది

లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు

గన్నవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కెవిఆర్ కిషోర్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న గన్నవరం నియోజకవర్గస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం రాత్రి ముగిసింది. ఫైనల్‌లో గన్నవరం 1 జట్టు, నిడమానూరు జట్టు నువ్వా నేనా అన్నట్టుగా తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో చివరకు నిడమానూరు జట్టుపై గన్నవరం 1 జట్టు విజయం సాధించింది. రెండవ స్థానంలో నిడమానూరు జట్టు నిలిచింది. మూడవ స్థానంలో గన్నవరం-2 జట్టు, 4వ స్థానంలో కేసరపల్లి జట్టు నిలిచాయి. మొదటి స్థానంలో నిలిచిన గన్నవరం వన్ జట్టుకు పదివేల రూపాయలు నగదు రివార్డు, షీల్డ్ మాణిక్యాలరావు చేతుల మీదుగా అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు ఆరువేల రూపాయలు నగదు, షీల్డ్ అందించారు. మూడవ స్థానంలో జట్టుకు 3వేలు నగదు, షీల్డ్ ఇచ్చారు. నాలుగవ స్థానంలో నిలిచిన జట్టుకు రెండు వేల నగదు, షీల్డ్ అందజేశారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య, రిటైర్డ్ పిడి టిఎస్ఆర్‌కే ప్రసాద్, న్యాయవాది వెంకయ్య, ముక్కామల సుబ్బారావు, బాబూరావు, చౌదరి, కేఎస్ జగదీశ్వరరావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు

సిద్ధార్థ వర్సిటీలో హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ నేడు

కానూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో వచ్చే నెల 18, 19 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి 24 గంటల హ్యాకథాన్ కార్యక్రమానికి సంబందించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రవిచంద్ తెలిపారు. ఉదయం 11 గంటలకు వర్సిటీలోని వీసీ చాంబర్‌లో ఈ పోస్టర్ ఆవిష్కరణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వర్సిటీ ఆధ్వర్యంలో ఈ హ్యాకథాన్ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.



జంక్షన్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన వ్రతంలో పాల్గొన్న భక్తులు

సామూహిక కుంకుమార్చన

ఉయ్యూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాస ఏకాదశి పురస్కరించుకుని గండిగుంట షిర్డీసాయిబాబా మందిరంలో మంగళ వారం సామూహిక కుంకుమార్చన, లక్ష గులాబీల అర్చన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవికి మహిళలు కుంకు మార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సమా రాధన పెద్దయెత్తున నిర్వహించారు, ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల బాబ్జి, బొప్పిడి ఉషా, మండవ జయదేవ్ తదితరులు పాల్గొని సేవలందించారు.

హనుమాన్‌జంక్షన్ : స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సామూహిక రమా సత్యనారాయణస్వామివ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు వ్రతం నిర్వహించగా శ్రావణమాసం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతం అచరించారు. ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు పూజా సామగ్రి అందజేశారు.



డ్యాంగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఘనంగా ఫొటోగ్రఫీ డే

ఉయ్యూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళ వారం ప్రపంచ ఫొటోగ్రఫీ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టికర్త డ్యాంగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూనియన్ అధ్యక్షుడు భాస్కర్, సెక్రటరీ రమేశ్, సీనియర్ ఫొటోగ్రాఫర్లు రాంబాబు, త్రినాద్, ఇద్రీస్, బాషా, జేజీరావు, రామారావు, కోటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌లో వాటర్ శాంపిల్స్ సేకరణ

గుణదల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారుల ఆదేశాల మేరకు రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్లను సందర్శించి తాగునీరు పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరించారు. అదే సమయంలో పంచాయతీ కుళాయిల నుంచి సరఫరా అవుతున్న తాగునీరు కూడా సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించడం జరిగిందని తెలిపారు. వర్షాల కారణంగా విషజ్వరాలు ప్రబలకుండా ఉండాలన్న ఆలోచనతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తాగునీటి పరీక్షలు చేపట్టడం జరిగిందని చెప్పారు. వర్షాలు అధికంగా పడుతున్న కారణంగా ప్రజలు తాగునీటిని కాచి చల్లార్చి తాగడం మంచిదని తెలిపారు.

నిరుపేదల కల సాకారం

పేదల ఇళ్ల పట్టాలకు నిరభ్యంతరకర పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు పేరంటాళ్లమ్మ చెరువు వద్ద నివసిస్తున్న వీరంతా నిరుపేదలు...వీరికి దశాబ్దాల కిందట గత ప్రభుత్వాలలో నివాసముండేందుకు కొద్ది కొద్ది విస్తీర్ణాలలో ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. దీంతో వీరంతా తమ కున్న ఆర్థిక స్తోమత కొద్దీ ఇళ్లు నిర్మించుకొన్నారు. అయితే పిల్లల పెళ్ళిళ్లు, చదువులు, అనారోగ్యం లాంటి ఏవైనా ఆర్థిక ఇబ్బందులు తలెత్తినప్పుడు అవసరాలకు ఇళ్లపై బ్యాంకు లోన్లు తీసుకోవడానికి లేదా ఇల్లు తెగనమ్ముకొని డబ్బులు తెచ్చుకొనేందుకు ప్రభుత్వ నిబంధనలు అడ్డంకిగా మారేవి. కడుపున పుట్టిన బిడ్డలకు సదరు ఆస్తిని చట్టప్రకారం బదిలీ చేయాలన్నా నిబంధనలు అడ్డుగా ఉండేవి. దీంతో ఈ నిరుపేదలు గ్రామ టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారుల ద్వారా ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కలిసి కొన్నాళ్ల క్రితం తమ గోడు వెళ్లబోసుకొన్నారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి అర్హులయిన స్థానికుల జాబితాను తయారు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధికారులు నిబంధనల ప్రకారం అర్హుల జాబితాలు తయారు చేసి మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పోరంకి టీడీపీ కార్యాలయంలో వారికి పొజిషన్ సర్టిఫికెట్లు, నిరభ్యంతరకర ధ్రువపత్రాలు(ఎన్వోసీలు) పంపిణీ చేశారు. దీంతో దశాబ్దాలుగా తాము పడుతున్న కష్టాలకు ఎమ్మెల్యే చెల్లుచీటీ చెప్పడంతో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో తహశీల్దారు గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, సంగెపు రంగా రావు, తోటకూర ఉదయభాస్కర్, మోర్ల నరేంద్ర, మటపర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోరంకి టీడీపీ కార్యాలయంలో పేదలకు ఎన్వోసీలు అందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

వాటర్ పైపులైన్‌కు శంకుస్థాపన

ఎంతో కాలంగా ఇబ్బందులు పడుతున్న పోరంకి రామాపురం కాలనీవాసుల తాగునీటి కష్టాలు త్వరలో తీరనున్నాయి. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రూ. 24.5 లక్షల సాధారణ నిధులతో మంగళవారం రామాపురం కాలనీలో మంచినీటి పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాడిగడప మునిసిపాలిటీలోని కీలక పోరంకి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది కాలంలోనే పోరంకిలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులను తెచ్చి అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, బోడె సురేంద్ర, తాతపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలి: డీఎస్పీ



హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నేరాలను అదుపులోకి తీసుకోవడానికి పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని డీఎస్పీ సీహెచ్. శ్రీనివాసరావు జంక్షన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం సాయంత్రం బాపులపాడులో విశ్రాంతి పీఏసీఎస్ సొసైటీ కార్యదర్శి వీరమాచనేని నాగయ్య నివాసంలో నాగయ్య తల్లి సుశీల నిద్రపోతుం డగా ఆమె మెడలో రూ.3 లక్షలు విలువ చేసే బంగారం గొలుసును గుర్తు తెలియని దుండగుడు అపహరించాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ మంగళవారం బాధితులను పరామర్శించారు. పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు ఆరా తీసుకోవాలని ఈ సందర్భంగా ఎస్సై వి.సురేష్, పోలీస్ సిబ్బందికి సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు.

సాంకేతిక విద్యకు లయన్స్ సహకారం

గన్నవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు ఉపయోగపడేలా కంప్యూటర్లను అందించడం అభినందనీయమని లయన్స్ గవర్నర్ అంజనేయులు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా లయన్స్‌క్లబ్ హనుమాన్ జంక్షన్, తేలప్రోలు సంయుక్త ఆధ్వర్యంలో వితరణ చేసిన కంప్యూటర్లను ప్రిన్సిపాల్ రామచంద్రరావుకు ఆయన మంగళవారం అందజేశారు. లయన్స్ వైస్ గవర్నర్లు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, హనుమాన్‌జంక్షన్, తేలప్రోలు, గన్నవరం లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.



కంప్యూటర్లు అందజేస్తున్న లయన్స్ గవర్నర్ ఆంజనేయులు

కరకట్ట ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెనమలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నది దిగువకు లక్షల క్యూసెక్కుల నీటి విడుదలతో పెనమలూరు మండల అధికారులు కరకట్ట ప్రాంత గ్రామాల ప్రజలను మంగళవారం అప్రమత్తం చేశారు. కృష్ణానది నుంచి సముద్రంలోకి నీటి విడుదల కారణంగా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పెదపులిపాక సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి, ఎంపీడీఓ బండి ప్రణవి నేతృత్వంలో మైక్ ద్వారా పెదపులిపాకలో ప్రచారం చేశారు.



పెదపులిపాక కరకట్ట వద్ద కృష్ణా ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, సర్పంచి

అభయాంజనేయ ఆలయంలో ఆకట్టుకున్న భజన

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో శ్రావణ మంగళవారం పురస్కరించుకొని తాడేపల్లిగూడెం పెంటపాడు మండలం బోడపాడు గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ సరస్వతుల హనుమంతరావు బృందం ఆసక్తికరంగా రామభక్త హనుమాన్ భజన కార్యక్రమం నిర్వహించారు. ఈవో తారకేశ్వరరావు, ఉత్సవ కమిటీ నాయకులు వేమూరి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

సిద్ధార్థ వర్సిటీలో మెగా వైద్యశిబిరం

కానూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఆవరణలో మూడు రోజుల పాటు జరిగే ఉచిత మెగా వైద్యశిబిరం మంగళవారం ప్రారంభమయింది. వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్, ఫ్యూర్ విజన్ ఐ లేజర్ సెంటర్, పెద్దేశ్వర్ హెల్త్ సెంటర్, ఆపిల్ డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈవైద్య శిబిరంలో కార్డియాలజీ, ఆప్తాల్మాలజీ, దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. వర్సిటీలో పనిచేసే సిబ్బందికి ఉచితంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రొ. వీసీ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, ఎన్ఎస్ఎస్ అధికారులు శివరాంప్రసాద్, సుష్మతోపాటు పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న వర్సిటీ ప్రొ. వీసీ రత్నప్రసాద్

దుర్గగుడిలో నిత్యాన్నదానానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలోజరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు దాతలు మంగళవారం ఆలయ అధికారులకు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటంతో పాటు విరాళం రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అందజేశారు. కాగా, విజయవాడ రూరల్ రామవరప్పాడుకు చెందిన కడియాల శాంతి సుభాష్ అన్నదాన పథకానికి రూ.1,00,008లు విరాళంగా ఈ.ఓ వి.కె.శీనానాయక్‌కు అందచేశారు. విజయవాడ కానూరు చనుమోలు నగర్‌కు చెందిన కొల్లి మోహన కృష్ణారెడ్డి తన కుమారుడు శర్వరెడ్డి, తన తండ్రి వీర వెంకట శివ ప్రసాద్ రెడ్డి పేరున అన్నదాన పథకానికి రూ.1,00,116లు అందజేశారు.



దాత కొల్లి మోహన కృష్ణారెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

రైతుల ఆర్థికాభివృద్ధికి సొసైటీలు కృషి చేయాలి



ఉంగుటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధికి సొసైటీ నూతన పాలకవర్గాలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు అన్నారు. ఉంగుటూరు పీఏసీఎస్ నూతన త్రిసభ్యకమిటీ ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది. చైర్‌పర్సన్‌గా ఈడ్పుగంటి కృష్ణమూర్తి, సభ్యులుగా బంకుర ప్రసాద్, నేతల బుజ్జిబాబు బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బాలవర్ధనరావు నూతన పాలకవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు.

● ఆత్కూరు పీఏసీఎస్ నూతన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక టీడీపీ నాయకులు, సంఘసిబ్బంది, గ్రామపెద్దలు, రైతుల సమక్షంలో ఘనంగా జరిగింది. చైర్‌పర్సన్‌గా సబ్బినేని తనూజ, పర్సన్లుగా దాసరి శ్రీనివాసరావు, వరదా అచ్యుతరామయ్యలు బాధ్యతలు స్వీకరించారు. టీడీపీ గ్రామాధ్యక్షుడు అట్లూరి రామ్ కిరణ్, సొసైటీ సెక్రటరీ సురేష్, సిబ్బంది, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.



నేనూ కేన్సర్ బాధితురాలినే..!

- విశ్వసుందరి సుచతా చువాంగ్ శ్రీ
- మరో ఆసియా విశ్వ సుందరితో కలిసి కేన్సర్ నిర్ధారణ శిబిరం ప్రారంభం



గుడ్లవల్లేరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ముందస్తుగా చేయించుకోవడం వల్ల తొలిదశలో కేన్సర్‌ను కనుగొంటే ఆ మహమ్మారి నుంచి విజయవంతంగా బయట పడవచ్చు. తాను 16ఏళ్ల వయస్సులో కేన్సర్ బారిన పడి ధైర్యంగా కేన్సర్‌ను ఎదుర్కొని బయట పడ్డానని విశ్వసుందరి 2025 ఓపల్ సుచతా చువాంగ్ శ్రీ అన్నారు. మంగళవారం సాయంత్రం గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామంలో సుధారెడ్డి ఫౌండేషన్, ఎంఈఐఎల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రొమ్ము కేన్సర్ నిర్ధారణా శిబిరాన్ని, మొబైల్ కేన్సర్ సెంటర్‌ను ఆమె మిస్ ఆసియా 2025 కృష్ణా గ్రావిడెజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో మహిళలతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన పింక్ పవర్ రన్ 2.0 ప్రకటన ప్రెస్ మీట్‌లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలోని ప్రతి మహిళకు తాను చెబుతున్నానని, మీరు ఒంటరికాదు, తానూ బ్రెస్ట్ కేన్సర్ బాధితురాలినే, భయాన్ని, అనిశ్చితిని, అంతులేని పోరాటాన్ని తాను ఎదుర్కొని మహమ్మారిని జయించానన్నారు. సమాజంలో కలిసి నడుస్తూ ధైర్యంగా జీవించి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. మిస్ ఆసియా 2025 కృష్ణా గ్రావిడేజ్ మాట్లాడుతూ ఆరోగ్యం నగరాలకే పరిమితమై ఉండకూడదని, డోకిపర్రులో సుధారెడ్డి ఆధ్వర్యంలో ఈ కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. అందరం కలిసి పోరాడితే ఎలాంటి రుగ్మతలనైనా అంతమొందించవచ్చన్నారు. సుధారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్-బ్యూటీ విత్ ఏ పర్పస్ గ్లోబెల్ అంబాసిడర్ సుధారెడ్డి మాట్లాడుతూ డోకిపర్రు గ్రామం ఎంతో విశేషమైన ప్రాంతమని, ఏడుకొండలపై కొలువున్న వెంకటేశ్వరుడే గ్రామానికి వచ్చి నివాసం ఏర్పర్చుకొన్నారనీ, ఎక్కడో ఉండే విశ్వసుందరిలను ఈ గ్రామీణ ప్రాంతంలోకి రప్పించుకొన్న ఈ గ్రామం ఉన్నతమైందన్నారు. అలానే పీవీ కృష్ణారెడ్డి వంటి మహోన్నత వ్యక్తిని దేశానికిచ్చింది కూడా ఈ గ్రామమేనన్నారు. దేశంలో ఎక్కువ శాతం మహిళలు కేన్సర్‌కు సంబంధించిన మరణాలు కన్పిస్తున్నాయన్నారు. ముందుగా దాన్ని మహిళల్లో ముందస్తు అవగాహనతో తొలిదశలోనే గుర్తించేలా అవగాహన కల్పించాలని తాము ఈ స్క్రీనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. పింక్ రన్ 2.0 రెండవ ఎడిషన్‌ను సుధారెడ్డి విశ్వసుందరీమణులతో కలిసి ప్రకటించారు. హైదరాబాద్‌లో ఆగష్టు 28న ఈ పింక్ రన్ 2.0 నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సుందరీమణులు గోశాలకు వెళ్లి ఆవులకు మేతను పెట్టి నమస్కరించారు. గ్రామంలో మహిళలను పలకరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలనచేసి స్క్రీనింగ్‌ను ప్రారంభించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షించారు. అనంతరం సుధారెడ్డితో కలిసి శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామి వద్దకు సంప్రదాయ దుస్తులతో వెళ్లి దర్శించుకొన్నారు. వీరిని కృష్ణాజిల్లా డిప్యూటీ కలెక్టర్ బీ శ్రీదేవి, మచిలీపట్నం ఆర్‌డీవో కే స్వాతి కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. తహసీల్దార్ లోకరాజు, గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు, గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.





కేన్సర్ నిర్ధారణ శిభిరాన్ని ప్రారంభిస్తున్న విశ్వసుందరి సుచతా, ఆసియా సుందరి కృష్ణా గ్రావిడెజ్, సమావేశంలో పాల్గొన్న సుధారెడ్డి



కలెక్టర్ లక్ష్మీశను కలిసిన హెచ్‌సీఎల్ ప్రతినిధులు

సృజనాత్మక ఆలోచనలకు రైజ్ ఫర్ యూ

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలు మెరుగుపరుచుకొనేందుకు, సరికొత్త సృజనాత్మక ఆలోచనలతో ప్రాజెక్టుల రూపకల్పనకు హెచ్‌సీఎల్ సంస్థ రైజ్ ఫర్ యూ చేపడుతోందని, ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మంగళవారం కలెక్టర్‌ను హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధులు కలిసి రైజ్ ఫర్ యూ విశిష్టతను వివరించారు. 40 రోజుల శిక్షణలో పాల్గొనేందుకు ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ ఫైనలియర్ విద్యార్థులు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్‌కు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో (9849465427) సంప్రదించవచ్చన్నారు. ఈనెల 12న ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో శాండ్ స్పేస్ టెక్నాలజీస్‌కు ఎంపికైన అభ్యర్థులు కలెక్టర్ చేతులమీదుగా నియమాక పత్రాలు అందుకున్నారు. వికాస పీడీ కే లచ్చారావు, మేనేజర్ వంశీ పాల్గొన్నారు.

మింగిందెవరూ.. మిస్సయ్యిందెవరూ..!

- ఎన్టీటీపీఎస్ హెచ్‌పీ పెట్రోల్ బంకులో నిధుల స్వాహా
- పరస్పర కేసులతో వెలుగులోకి స్వాహాపర్వం
- సమగ్ర విచారణ చేయాలని కో-ఆపరేటివ్ సభ్యుల డిమాండ్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీటీపీఎస్‌కు చెందిన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పెద్దమొత్తంలో నిధులు స్వాహా పర్వం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందులో పనిచేసే ఒక సాధారణ వ్యక్తి కనిపించకుండా పోయాడంటూ ఆయన భార్య ఈనెల 8న పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఇబ్రహీంపట్నం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆ కేసుతో బంక్‌లో పనిచేస్తున్న మరో కీలక వ్యక్తి మిస్సయిన వ్యక్తి నిధులు స్వాహా చేశాడంటూ మరో ఫిర్యాదు చేశాడు. బంక్‌లో మొత్తం రూ. అరకోటికి పైగా నిధులు స్వాహా అయినట్లు భోగట్టా. కేవలం టెన్త్ కూడా చదవని వ్యక్తికి బంక్ నిర్వహణ బాధ్యతలు ఎందుకు అప్పగించారు.. ఏరోజు లెక్కలు ఆరోజు ఎందుకు తేల్చకుండా ఉన్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత మొత్తంలో నగదు స్వాహా ఆ వ్యక్తి ఒక్కడే ఎలా చేయగలిగాడు. ఇందులో ఎంత మంది పాత్ర ఉందనే అంశాలు తేల్చాల్సి ఉంది. బంక్‌లో నిధుల స్వాహాపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎన్టీటీపీఎస్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.



రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ సంతోషం

- శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వేదికగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించటం సంతోషకరమని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న యువ ఆంధ్రా చాంపియన్‌షిప్ కబడ్డీ-2025 పోటీల్లో 5వ రోజు మ్యాచ్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కబడ్డీకి విశేష ఆదరణ లభిస్తోందని, రాష్ట్రంలో కబడ్డీ బలోపేతానికి అన్ని విధాల కృషి చేస్తున్నామన్నారు. ఏడేళ్ల తరువాత ప్రో కబడ్డీ తిరిగి రావడం హర్షణీయమని రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నామన్నారు. అనంతరం కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందించారు. అనంతరం జరిగిన మ్యాచ్‌లలో కర్నూలు, వైజాగ్, భీమవరం, అమరావతి జట్లు విజయం సాధించాయి. ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచలి శ్రీకాంత్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు మొండిచెయ్యి

- ఇఫ్టూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామకృష్ణ

ధర్నాచౌక్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మొండిచెయ్యి చూపిందని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ విమర్శించారు. ఇఫ్టూ-బీసీడబ్ల్యూ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ధర్నా మంగళవారం ధర్నాచౌక్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షల కుటుంబాలు వివిధ 36 రకాల వృత్తుల్లో భవననిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నుంచి రూ.10 లక్షలు, సహజంగా మృతి చెందినవారికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. 50ఏళ్లు దాటిన కార్మికులకు సంక్షేమ బోర్డు నుంచి వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తమది కార్మిక ప్రభుత్వమని చెప్పి అధికారంలోకి వచ్చాక కార్మికులను గాలికొదిలేసిందని విమర్శించారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి జీ హరికృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పోలయ్య, కే రమణ, షేక్ మీరావలి, కొప్పుల కుమార్, రాజశేఖర్, చిట్టిబాబు, రవీంద్ర, సుబ్బారావు, కాశీ, భవననిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సీటు కోసం బస్సులో కుస్తీ

- ఫ్రీ బస్సు పథకం అమలుతో పెరుగుతున్న ఫిర్యాదులు
- ఆర్టీసీ సిబ్బందిపై 200లకు పైగా ఫోన్‌కాల్స్
- తలపట్టుకుంటున్న అధికారులు



జగ్గయ్యపేట డిపో బస్సులో ఘర్షణ పడుతున్న మహిళలు

జగ్గయ్యపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకానికి మహిళల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. జగ్గయ్యపేట నుంచి బయల్దేరే బస్సులకు గతంలో నందిగామ బస్‌స్టేషన్‌కు వచ్చేసరికి 40 శాతం సీట్లు ఖాళీగా ఉండేవి. ఇప్పుడు ఈ నందిగామ చేరేలోపు బస్సులు ఫుల్ అయిపోతున్నాయి. బస్సు ఖాళీ లేదని కొన్ని స్టాప్‌ల వద్ద బస్సులను ఆపటం లేదు. దాంతో ఈ తరహా ఫిర్యాదులపై ఆర్టీసీ అధికారులకు 200 వరకు ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. కొందరు సిబ్బంది తమను ఫ్రీ బస్సు అని ఎక్కారా అంటూ అవహేళన చేస్తున్నారని, మరికొందరు చెయ్యెత్తితే బస్సు ఆపుతామని చెప్పి, తమ ఊళ్లో ఆపలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. కొంత మంది పురుషులు టికెట్ కొనుక్కుని నిలుచోని వెళ్లాల్సి వస్తుందని, స్పెషల్ బస్సులు వేయాలని అధికారులను కోరుతున్నారు. మంగళవారం విజయవాడ నుంచి జగ్గయ్యపేట బయల్దేరిన జగ్గయ్యపేట డిపో బస్సులో సీట్ల కోసం ఒక మహిళ, టీనేజీ యువతి మధ్య జరిగిన గొడవ ఘర్షణకు దారి తీసింది. ఎంతమంది చెప్పినా సర్దుకుపోకపోగా కొట్టుకోవటంతో కండక్టర్లు వారించలేక సతమతమయ్యారు. దీంతో దింపేస్తామంటూ హెచ్చరించాల్సి వస్తుంది. కాగా విజయవాడ రూట్‌లో పెరిగిన రద్దీ దృష్ట్యా గతంలో జగ్గయ్యపేట బస్ స్టేషన్‌కు రాకుండానే కోదాడ వరకు నడిపిన విద్యాధరపురం డిపో బస్సులను ఇప్పుడు జగ్గయ్యపేట నుంచి విజయవాడ మధ్య నడుపుతున్నారు. ఇంకా జగ్గయ్యపేట - విజయవాడ మధ్య బస్సు సర్వీసులను పెంచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మహిళా ప్రయాణికులు సీట్ల విషయమై సంయమనంతో వ్యవహరించాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. రద్దీ పెరిగితే ప్రభుత్వం తగు సంఖ్యలో బస్సుల సంఖ్యను పెంచుతుందని చెబుతున్నారు.

అంతర్రాష్ట్ర సర్వీసుల పేరుతో కొర్రీ తగదు

అంతర్రాష్ట్ర సర్వీసుల పేరుతో జగ్గయ్యపేట నుంచి తెలంగాణకు తిరిగే బస్సుల్లో మహిళా ప్రయాణికుల నుంచి చార్జీలు వసూలు చేయటంపై కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అభ్యంతరం తెలిపారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై ఆయన స్పందిస్తూ పేరుకు అంతర్రాష్ట్ర సర్వీసులు అయినప్పటికీ అవి రెండు ప్రాంతాల మధ్య షటిల్ సర్వీసులని, పల్లె వెలుగు బస్సులే నడుపుతున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం బస్సులను వారి సరిహద్దు వరకు ఉచిత రవాణా కల్పిస్తుంటే, అందుకు భిన్నంగా మన రాష్ట్రంలో నిబంధనలు ఉండటం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం స్పందించి ఫ్రీ బస్సు విధానంలో లోపాలు సరిచేయాలని డిమాండ్ చేశారు.

అవార్డుల పంట



డీ లక్ష్మణ, విజయవాడ



ఆర్ లావణ్యకుమార్, తిరుపతి



అవార్డులు అందుకున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు లక్ష్మణ్ (విజయవాడ), లావణ్యకుమార్ (తిరుపతి), సాయికుమార్ (తిరుపతి)తో సీనియర్ ఫొటో జర్నలిస్టు జీవీ నారాయణ



వై రామకృష్ణ, విశాఖపట్నం



కే సాయి కుమార్, తిరుమల

186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ (ఏపీపీజేఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతలకు అవార్డుల ప్రదానోత్సవం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగింది. విజేతలకు సురేష్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అవార్డులు ప్రదానం చేశారు. ఆంధ్రజ్యోతికి నాలుగు అవార్డులు దక్కాయి.

తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక

- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్



న్యూఢిల్లీలో జరిగిన బీసీ సెమినార్‌లో మాట్లాడుతున్న విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని.

వన్‌టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నుముక అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. జాతీయ స్థాయిలో హక్కుల సాధనకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో మంగళవారం జరిగిన సెమినార్‌లో ఎంపీ కేశినేని చిన్ని పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు శాలువాతో సత్కరించారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీసీ కమ్యూనిటీ హాల్స్‌లో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ పెట్టించేందుకు కృషి చేస్తానన్నారు. బీసీల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీయే ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని, బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్ రావు, పాకా వెంకట సత్యనారాయణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావు యాదవ్, ఏపీ ఇన్‌చార్జ్ యలగాల నూకానమ్మ యాదవ్‌లతో పాటు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలించండి

కృష్ణనదికి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు రావటంతో జిల్లా అధికారులను అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంత ప్రజలను, నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కలెక్టర్ లక్ష్మీశను ఆదేశించారు. కృష్ణానదికి వచ్చిన వరద గురించి, జిల్లాలో కురుస్తున్న వర్షాలపై శివనాథ్ మంగళవారం ఢిల్లీ నుంచి ఫోన్‌లో కలెక్టర్ లక్ష్మీశతో మాట్లాడారు. వరద ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా ఆయన ఎప్పటికప్పుడూ జిల్లా యంత్రాంగంతో ఫోన్లో మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అవసరమైన సలహాలు, సూచనలు చెబుతున్నారు. నదీ పరివాహక ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు, నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ప్రజలకు ఆహారంతో పాటు తాగునీరు, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఎంపీ సూచించారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయాలు స్థాపనపై ప్రణాళికలు లేవు: కేంద్ర సహాయ మంత్రి

కేంద్ర ప్రభుత్వానికి కొత్త కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఏర్పాటు విషయంపై ప్రస్తుతానికి ఎలాంటి ప్రణాళిక లేకపోయినా, ఇప్పటికే ఉన్న విశ్వవిద్యాలయాలకు నిధులు పెంచుతూ, పరిశోధన, బోధన రంగాలను బలోపేతం చేస్తోందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి వెల్లడించారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభలో మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) దేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలల ఏర్పాటు గురించి ప్రశ్నించగా, ఆ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి లిఖిత పూర్వకంగా బదులిచ్చారు. ముఖ్యంగా ఏపీలో కొత్తగా కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు స్థాపించే ప్రణాళికలు ప్రస్తుతం లేవని స్పష్టం చేశారు. అలాగే భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఆమోదం పొందిన ప్రైవేట్ వ్యవసాయ కళాశాలలు దేశవ్యాప్తంగా 34 ఉన్నప్పటికీ, వాటిలో ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 4 మాత్రమే ఉన్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో మూడు మాత్రమే కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు (మణిపూర్‌లోని ఇంఫాల్, బీహార్‌లోని పూసా, ఉత్తర ప్రదేశ్‌లోని ఝాన్సీ) ఉన్నాయని వివరించారు. ఈ విశ్వవిద్యాలయాలకు ఐదేళ్లో రూ.2,800 కోట్లకు పైగా నిధులు కేటాయించబడ్డాయన్నారు.

వీర పరివార్ సహాయక యోజన

లీగల్ సర్వీస్ క్లినిక్ ప్రారంభం

- ప్రారంభించిన జిల్లా జడ్జి గుట్టల గోపి



విజయవాడ లీగల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వీర పరివార్ సహాయక యోజన పేరుతో లీగల్ సర్వీస్ క్లినిక్‌ను మంగళవారం కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి ఐజీఎం స్టేడియంలోని ఎక్స్‌సర్వీస్ ఆఫీసు నందు ప్రారంభించారు. డిఫెన్స్‌లో పనిచేసిన ఎక్స్ సర్వీస్‌మెన్, వారి కుటుంబ సభ్యుల నిమిత్తం ఈ లీగల్ సర్వీస్ క్లినిక్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గుట్టల గోపి మాట్లాడుతూ ఎక్స్ సర్వీస్‌మెన్, వారి కుటుంబ సభ్యులు తమ న్యాయపరమైన సమస్యలను ఈ లీగల్ సర్వీస్ కేంద్రం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం ఇలాంటి లీగల్ సర్వీస్ క్లినిక్ ఏర్పాటు చేసిన ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ వారిని మండల న్యాయసేవాధికార సంస్థ అధికారి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఏ సత్యానందం అభినందించారు. మాజీ సర్జికల్ లెఫ్టినెంట్ క్యాడర్ డాక్టర్ కే కల్యాణవీణ, కృష్ణాజిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ మాట్లాడుతూ ఎక్స్‌సర్వీస్‌మెన్ వారి కుటుంబసభ్యులు తమ న్యాయపరమైన సమస్యలను ప్రతి శనివారం ఈ క్లినిక్‌కి వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా మాట్లాడుతూ ఈ కేంద్రానికి న్యాయ వలంటీర్, న్యాయవాది అయిన బి.శేఖర్‌బాబు అత్యున్నత సేవలు వలంటరీగా అందించారని ఈ కేంద్రానికి ఆయన ఉచిత న్యాయ సలహా అధికారిగా ఏర్పడటం ఎంతో గొప్ప అదృష్టమన్నారు. 12వ అదనపు జిల్లా జడ్జి ఎస్ సునీల్, కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి భూపాల్‌రెడ్డి, పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భువనమ్మ, ఎంపీ ఎమ్మెల్యే కోర్టు న్యాయమూర్తి ఏ అనిత, ఏసీబీ జడ్జి పీ భాస్కరరావు, 13వ అదనపు జిల్లా జడ్జి శేషయ్య, ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి తిరుమల వెంకటేశ్వర్లు, 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి, 7వ అదనపు జిల్లా జడ్జి అబ్రహం, 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి టీ అంజని ఎస్ఎస్ రామ ఆదిత్య రిషిక, 3వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పీ తిరుమలరావు, బెజవాడ బార్ మహిళా కార్యదర్శి రే అనురాధ, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

రాజధానిపై బహిరంగ చర్చకు సిద్ధమా!

- ఎమ్మెల్యే కొలికపూడి సవాల్



తిరువూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి వరదలకు మునిగిపోతుందని, జగన్‌తో పాటు ఆయన సైకోబ్యాచ్ దుష్ప్రచారం సాగిస్తోందని, అమరావతిపై బహిరంగ చర్చకు తాను సిద్దమని, జగన్‌కానీ ఆయన పార్టీ నేతలెవరైనా చర్చకు రావొచ్చని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సవాల్ చేశారు. మంగళవారం తన కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని మునిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్న వైసీపీ శ్రేణులు, జగన్‌రెడ్డి తాడేపల్లిలో కట్టుకున్న ప్యాలెస్ ముంపునకు గురైందా! అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుంటే, కొద్దిపాటి వర్షానికే అమరావతి మునిగిందని, జగన్ పత్రిక విషం కక్కుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 400 ఏళ్ల చరిత్ర కలిగి, ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన, హైదరాబాద్ సముద్రతీరానికి కొన్ని వందల అడుగు ఎత్తులో ఉన్నా కొద్దిపాటి వర్షాలకే అతలాకుతలం అవుతోందని, సముద్రానికి దగ్గరగా ఉన్న అమరావతి కొద్దిపాటి వర్షాలకే మునుగుతుందని, జగన్ బ్యాచ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు దూరదృష్టితో కొండవీటివాగు నిర్మాణం చేపట్టి ఆ వాగుద్వారా ఎలాంటి వరదనీటినైనా నదిలోకి మరలించడం జరిగిందన్నారు. ప్రస్తుతం మన రాజధానిలో అధునాతన విధానంలో అండర్ గ్రౌండ్ డ్రెయినన్లు, కేబుళ్ల ఏర్పాట్ల పనులు జరుగుతున్నాయని, డ్రెయిన్లు ఉంటే ఎలాంటి వరదముంపు ఉండదన్నారు. రాజధాని అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా తప్పుడు ప్రచారం చేయిస్తున్న జగన్‌ను సైకోకాక ఇంకా ఏం అనాలన్నారు. జగన్‌రెడ్డి ఎన్నిక కుట్రాలు, నీచప్రచారాలు చేసినా అమరావతికి ఎలాంటి ముంపు రాదని ఎమ్మెల్యే కొలికపూడి పేర్కొన్నారు. కూటమి నేతలు బొమ్మసాని మహేష్, రాజవరపు శ్రీనివాసరావు, ఉయ్యూరు జయప్రకాష్, సింధు శ్రీను, ఆకుల ప్రసాదు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

యాకమూరులో మిస్ వరల్డ్ విజేత సందడి

తోట్లవల్లూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం యాకమూరులో మంగళవారం థాయ్‌లాండ్‌కు చెందిన మిస్ వరల్డ్ 2025 విజేత ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ సందడి చేసింది. మేఘా ఇంజనీరింగ్ అధినేత కృష్ణారెడ్డి సతీమణి సుధారెడ్డి ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీని యాకమూరులోని శ్రీనగర్ కాలనీలో ఉన్న తమ ఇంటికి తీసుకు వచ్చారు. సుధారెడ్డి 2025 మిస్ వరల్డ్ పోటీల్లో జడ్జిగా ఉన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం కుసుమకుమారి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీని తీసుకొస్తున్న కుసుమకుమారి

శిథిలావస్థలో వంతెనలు

- రెయిలింగ్ విరిగి, కుంగిన వంతెనలు
- ఆందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ) : దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పెదపారుపూడి మండలం ఈదులమద్దాలి-మోపర్రు గ్రామాల మధ్య చంద్రయ్య కాలువపై ఉన్న వంతెన, సిద్ధాంతం వద్ద లేళ్లపూడి ఛానల్, కొమరవోలు మురుగుకాలువపై ఉన్న వంతెన,వెంట్రప్రగడ వద్ద దోసపాడు ఛానల్‌పై వంతెనలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి.

పెదపారుపూడి మండలం ఈదులమద్దాలి-మోపర్రు గ్రామాల మధ్య చంద్రయ్య కాలువపై ఉన్న వంతెన కొంత భాగం ఇటీవల విరిగింది. వంతెన శిథిలావస్థలో ఉన్నా భారీ వాహనాల తాకిడితో వంతెన దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయి. అధ్వాన స్థితికి చేరుకున్న వంతెనకు ఆర్అండ్‌బీ అధికారులు ఇసుక బస్తాలతో కుంగిన భాగాన్ని నింపి చేతులు దులుపుకున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ నుంచి చంద్రయ్యకాలువకు అధికంగా మురుగునీరు వస్తుండటంతో తూతూ మంత్రంగా మరమ్మతులు చేసిన భాగం కొట్టుకుపోయే ప్రమాదముంది.

సిద్ధాంతం వద్ద లేళ్లపూడి ఛానల్, కొమరవోలు మురుగుకాలువపై ఉన్న వంతెన స్థితి అత్యంత భయానకంగా ఉంది. వెడల్పు తక్కువ వంతెన కావడంతో వాహనాల దాటికి వంతెన రెయిలింగ్‌లు విరిగిపోయాయి. వంతెన మలుపు వద్ద నీటి ప్రవాహానికి కొంతభాగం కొట్టుకుపోయింది. దీంతో పెద్ద గొయ్యి ఏర్పడటంతో ఆర్అండ్‌బీ అధికారులు ఫ్లైయాష్ కంకర మిక్స్‌ను వంతెన వెంబడి గుట్టగా పోసి చేతులు దులుపుకున్నారు. ఒక వైపు అప్రోచ్ రోడ్డు కూడా దెబ్బతింది. మల్లాయిపాలెం, మోటూరు, చౌటపల్లి గ్రామస్థులు గుడ్లవల్లేరు, బందరు వైపు వెళ్లేందుకు ఈ వంతెన మీదగా రాకపోకలు సాగిస్తుంటారు. మలుపు వద్ద ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉన్నా కూడా అధికారులు ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు.

గుడివాడ-విజయవాడ రాకపోకలకు అత్యంత కీలకమైన ప్రాంతం వెంట్రప్రగడ వంతెన. పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ వద్ద దోసపాడు ఛానల్‌పై వంతెనను ఆర్అండ్‌బి అధికారులు నిర్మించారు. వంతెన మలుపు వద్ద కొంత మేర కాలువ కట్ట తెగి ఉంది. అదే విధంగా వంతెన రెయిలింగ్‌లు కూడా దెబ్బతిన్నాయి. వంతెన పరిస్థితిని తెలిపే ఎటువంటి సూచిక బోర్డులు ఏర్పాటుచేయలేదు. వంతెన వెడల్పు తక్కువగా ఉండటంతో ఒక వాహనం వంతెనపై వెళ్లాలంటే మరో వాహనం అటు నిలిచిపోవాల్సిందే.



ప్రమాదకరస్థితిలో ఉన్న వెంట్రప్రగడ వద్ద వంతెన



ఈదులమద్దాలి వద్ద కుంగిన వంతెన



సిద్ధాంతం వంతెనపై విరిగిన రెయిలింగ్

నిధులు మంజూరు కాలేదు

ఈదులమద్దాలి, వెంట్రప్రగడ, సిద్ధాంతం వంతెనలకు పునఃనిర్మాణానికి ఒక్కోక్క వెంతనుకు రూ.5కోట్లు చొప్పున రూ.15కోట్లతో అంచనాలు తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేపడతాం.

జె.కామేశ్వరరావు ,ఆర్అండ్‌బీ డీఈఈ



రైతులకు సూచనలిస్తున్న వి.శివనాగరాణి

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు

పామర్రు, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): వరి పైరులో మేలైన యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించుకోవచ్చునని మండల వ్యవసాయాధికారిణి వి.శివనాగరాణి అన్నారు. మండల పరిధిలోని ఉండ్రపూడిలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతులతోపాటు సమగ్ర సస్యరక్షణ, ప్రకృతి వ్యవసాయం గురించి గ్రామంలోని రైతులకు వివరించారు. అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత ఉండి రాని వారు 20తేదిసాయంత్రంలోపు ఆర్జీలు పెట్టుకోవాలని సూచించారు. గ్రామ వీఏఏలు, పాల్గొన్నారు.



నగేష్‌ను సత్కరిస్తున్న ఎఫ్‌డీఎఫ్ సభ్యులు

సీనియర్ ఫొటోగ్రాఫర్ నగేష్‌కు ఘన సత్కారం

గుడివాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : ఫ్రెండ్స్ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్ గోకవరపు నగేష్‌ను ఘనంగా సత్కరించారు. మంగళవారం స్థానిక బంటుమిల్లి రోడ్డులోని ఆయన స్వగృహంలో ఫ్రంట్ కన్వీనర్ డీఆర్‌బీ ప్రసాద్ ఆధ్వర్యంలో దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, తాడిపర్తి శ్రీనివాస్, వాసవి క్లబ్ జిల్లా నాయకులు గాదె మోహన్‌బాబు, ఎన్‌జీవోస్ జిల్లా నాయకులు షేక్ ఫరీద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఆర్థిక ఆసరా

గుడివాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఆర్థిక ఆసరాగా నిలుస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి 37మంది లబ్ధిదారులకు రూ. 20.42లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి,నందివాడ మండల అధ్యక్షుడు సన్యాసిరావు, సర్పంచ్ రాధాకృష్ణ, నాయకులు సయ్యద్ జబీన్, సుధారాణి, దాసు శ్యాం ప్రసాద్, కరీముల్లా, మౌలాలి పాల్గొన్నారు.

పమిడిముక్కల : పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందజేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోడునీడగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు తాడంకి లో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ముగ్గురికి చెక్కులు మంగళవారం అందజేశారు. డొక్కు దుర్గా నాగేంద్రరావుకు రూ. 65,000 వీరంకి సీతారామానుజమ్మకు రూ. 40,350, జంపాన ప్రియాంకకు రూ. 18,460 చెక్కులు అందజేశారు. అనంతరం ఇటీవల మరణించిన పంజుగుల రామారావు గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ సీనియర్ నాయకుడు జక్కాశ్రీనివాసరావు ఎమ్మెల్యేతో ఉన్నారు.

దేవాలయాల అభివృద్ధే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం రాత్రి స్థానిక విఘ్నేశ్వరస్వామి దేవస్థాన మండపంలో నూతన ఉత్సవ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. తొలుత స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దేవాలయాల పటిష్ఠత కోసం కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా సాయన రాజేష్, సభ్యులుగా లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, రమణమూర్తి, పోతురాజు, శైలజ, విజయలక్ష్మీ, శారద, దుర్గభవాని, గణపతి శాస్త్రీలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



గణపతి నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి తదితరులు

సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో ఏలాంటి అలసత్వం వహించకుండా సత్వర సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. కోసూరులో మంగళవారం సాయంత్రం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారం వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు అడిగిన పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపటంతోపాటు మరి కొన్ని సమస్యలను అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావేదిక ఒక చక్కటి పరిష్కారమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాస్, కూటమి నేతలు దేవినేని రమేష్, కిలారపు మంగమ్మ, తాతా నారాయణరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, తహసీల్దార్ మస్తాన్, మండల పరిషత్ ఏవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రజా వేదికలో అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

ముగిసిన గురుపౌర్ణమి మండల దీక్షలు

గుడివాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక గౌరీశంకరస్వామి వారి దేవస్థానం ఉపాలయమైన షిర్డిసాయి బాబా వారి మందిరంలో నెలరోజుల పాటు నిర్వహించిన సాయిబాబా గురుపౌర్ణమి మండల దీక్ష కార్యక్రమాలు ఘనంగా ముగిసాయి. మంగళవారం మాతృశ్రీ మండలి సభ్యుల ఆధ్వర్యంలో బాబా వారికి భజన కార్యక్రమం, బాబా పారాయణం నిర్వహించారు. మండల దీక్షల ముగింపు సందర్భంగా దేవస్థానంలో అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం గౌరీశంకర స్వామి దేవస్థానంలో కొలువై ఉన్న పార్వతీ అమ్మవారికి గుమ్మడి హనుమాన్ చౌదరి, సునీత దంపతులు శ్రావణమాసం సారెను సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు మాట్లాడుతూ శ్రావణమాసంలో అమ్మవారికి సారెను సమర్పించడం హర్షించదగ్గ విషయమని, విరాళ దాతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ మండలి ఆర్గనైజర్ చింతపల్లి విజయలక్ష్మీ, సంకుల దుర్గాంబ, చిన్ని, పాల్గొన్నారు.



అమ్మవారికి శ్రావణమాస సారెను సమర్పిస్తున్న భక్తులు

వినాయకచవితి పందిళ్లకు అనుమతులు తప్పనిసరి

● డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : గుడివాడ డివిజన్ పరిధిలో ఏర్పాటుచేస్తున్న వినాయకచవితి చలువ పందిళ్లకు పోలీసు శాఖ అనుమతులు తప్పనిసరి అని డీఎస్పీ ధీరజ్ వినీల్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేకమిటీ సభ్యులు పబ్లిక్ ప్రదేశాల్లో విగ్రహాలను ఏర్పాటు చేస్తే సంబంధిత శాఖల అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా మైక్‌లు, డీజే బాక్సులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్ నిమిత్తం విద్యుత్ శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లకు తావు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విభేదాలకు చోటు యివ్వకుండా సాంస్కృతిక కార్యక్రమాలు పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్సులు, మేళాలను నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఊరేగింపు సమయంలో నిమజ్జనం చేయడానికి వెళ్లే సమయంలో శాంతిభద్రలకు విఘాతం కలుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొంటే చర్యలు తప్పవని డీఎస్పీ ధీరజ్ వినీల్ హెచ్చరించారు.



ధీరజ్ వినీల్

డీఎల్‌పీవోకు సత్కారం

గుడివాడ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డీఎల్‌పీవో సంపత్ కుమారిని పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఘనంగా సత్కరించారు. గుడివాడ మండల డీఎల్‌పీవో సంపత్ కుమారి ఆగస్టు15న ఉత్తమ డీఎల్‌పీవోగా మంత్రి కొల్లు రవీంద్ర చేతులమీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.



డీఎల్‌పీవో సంపత్ కుమారిని సత్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

దేవాలయాల పాలకవర్గం ఏకగ్రీవం

నందివాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి కోసం దేవాలయాల కమిటీలు ఏర్పాటు చేయగా, గ్రామస్థులు దేవాలయ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు దేవాలయ అధికారి కానూరి రమేష్‌బాబు తెలిపారు. దేవాలయ కమిటీ తమిరిశ శివాలయం చైర్మన్‌గా పొట్లూరి చంద్రశేఖర్‌రావు, నెంబర్లుగా ఆగోళ్ల వెంకటేశ్వరరావు, సంగం రాంబాబు, పుష్పావతి, బాలినేని పద్మ, కరేటి సీతామహాలక్ష్మి, రావూరి నానిబాబు, మాదూరి మోహన్ కుమార్, రే మల్లి శ్రీదేవిగా మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించి దేవాలయ బాధ్యతలు కమిటీ సభ్యులకు అప్పగించినట్లు ఈవో సురేష్‌బాబు తెలిపారు. అనంతరం పూజారి మేడూరి వరప్రసాద్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రశేఖర్‌రావు, మాజీ సర్పంచ్ తోట వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

నందివాడ: పోలుకొండ శివాలయానికి నూతన కమిటీ దేవాలయ చైర్మన్‌గా గొట్టుముక్కల బోసురాజు నెంబర్లుగా బోయిన నాగ ప్రసాద్, మల్లప్రగడ నాగరాజేశ్వరి, మున్నంగి శివపార్వతీ, తుమ్మల విజయకుమారి, కుర్మా అనూష, పోలుకొండ జనార్ధనరావు, మోర్ల శ్రీనివాసరావు, చీకటి రంగారావు, కమిటీ సభ్యులుగా నియమితులైనట్టు దేవాలయ అధికారి కానూరి సురేష్‌బాబు తెలిపారు. అనంతరం సభ్యులను ఉప్ప వెంకటేశ్వరరావు, బుజ్జిబాబు, చినబాబు, బాబుజీ, రవీంద్ర, ఉమాపతి, తమ్మారెడ్డి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులకు పూలమాలలు వేసి సత్కరించారు. టీడీపీ సీనియర్ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ ఏసుబాబు, నాగరాజు, పాల్గొన్నారు.



తమిరిశ శివాలయం నూతన కమిటీ సభ్యులు



పోలుకొండ శివాలయం నూతన కమిటీ సభ్యులు

మొవ్వలో జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబరు 13న

కూచిపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మొవ్వ న్యాయస్థానంలో సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాసు కోర్టు న్యాయమూర్తి స్వర్ణలత వోల్గా మార్క ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గంగా లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చని కక్షిదారులు తమ న్యాయవాదుల ద్వారా సంప్రదింపులు నిర్వహించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.



ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలను సత్కరించిన ఎంపీపీ, కార్యదర్శులు

ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలకు ఘన సత్కారం

పెదపారుపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని జిల్లాలో ముందంజలో ఉంచుతున్న ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలు అభినందనీయులని జిల్లాస్థాయి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న వీరిని అందరూ స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని పెదపారుపూడి ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. మచిలీపట్నంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎంపీడీవో విమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్‌లు ఉత్తమ ప్రశంసాపత్రాలు అందుకున్న సందర్భంగా మండల పరిషత్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సహాయకులు ఏర్పాటు చేసిన అభినందన సభకు ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరై వారిని అభినందించి దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ రామ్మోహనరావు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం, అభివృద్ధే కూటమి లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము




మోటూరు పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న చీకటి శేషగిరిరావు

గుడివాడ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం మోటూరు పీఏసీఎస్ నూతన అధ్యక్షుడిగా చీకటి శేషగిరిరావు, గుంటా కోడూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా మెరుగుమాల బసవపున్నయ్యలు, సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీలు రైతులకు మంచి చేయాలని కోరారు. ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు , గుంటాకోడూరు డైరెక్టర్లుగా పల్లపోతు వీరబసవయ్య, అంగడాల వెంకటేశ్వరరావు, మోటూరు నూతన డైరెక్టర్లుగా దుంపల వెంకట నరసింహారావు, పంతగాని నరసింహారావులచే ప్రమాణస్వీకారం చేయించారు. టీడీపీ నాయకులు పిన్నమనేని బాబ్జి, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, వైస్ చైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, చెరుకూరి జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి: రైతు ప్రయోజనాల కోసం సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు చిత్తశుద్ధితో పని చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మంగళవారం జరిగిన కోసూరు పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చైర్‌పర్సన్‌గా దళపతిరావు సురేష్ రాజు, సభ్యులుగా రాజులపాటి రవి, జొన్నలగడ్డ చిట్టిబాబులు ప్రమాణ స్వీకారం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు రామలింగేశ్వరరావు, కార్యదర్శి తులసీదాస్ పాల్గొన్నారు.

పమిడిముక్కల : పీఏసీఎస్‌ద్వారా మెరుగైన సేవలందించి రైతుల సంక్షేమం, అభివృద్ధికి పాలకవర్గాలు కృషిచేసి తద్వారా పీఏసీఎస్‌లను మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. హనుమంతపురం పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన రాజులపాటి రామాంజనేయ ప్రసాద్, అల్లాడ రాంబాబు, శివపార్వతి లకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు, వెంకట్రామయ్య, సాంబశివరావు, మల్లికార్జునరావులు పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.



కోసూరు పీఏసీఎస్ త్రిమెన్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా



గుంటాకోడూరు పీఏసీఎస్ త్రిమెన్ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



హనుమంతపురం పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525



నిత్యాన్నదాన పథకానికి విరాళం

మోపిదేవి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన అబ్బూరి శేఖర్, మాధవి వనజ రూ.50,116 విరాళంగా అందజేశారు. కుటుంబసమేతంగా మంగళవారం ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావుకు విరాళాన్ని అందజేశారు.

ఫిషింగ్ హార్బర్‌కు నడకుదిటి పేరు

● మాజీ మంత్రి నరసింహారావు జయంతి కార్యక్రమంలో మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ హార్బర్‌కు మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు పేరు పెట్టి గౌరవించుకుందామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు జయంతి నిర్వహించారు. నడకుదిటి చిత్రపటానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, సీనియర్ టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ , తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, చిన్నాపురం సర్పంచ్ గోపాలరావు, టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, తలారి సోమశేఖర్, మరకాని పరబ్రహ్మం, శివగంగ సొసైటీ ప్రెసిడెంట్ పిప్పళ్ల కాంతారావు, టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కరెడ్ల సుశీల, లంకిశెట్టి నీరజ, జనసేన నాయకులు గడ్డం రాజు, మాదివాడ రాము, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్, గుండుపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడు తూమాటి బసవయ్య, ఎండీ ఇలియాస్ పాషా నివాళులర్పించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, బందరు ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి నడకుదిటి నరసింహారావు చేసిన కృషి మరువలేనిదన్నారు. దానికి నడకుదిటి నరసింహారావు పేరు పెట్టుకుని గౌరవించుకుందామన్నారు. బీసీలకు కమ్యూనిటీ హాలు నిర్మిస్తామన్నారు. నరసింహారావు జయంతి సందర్భంగా కోనేరు సెంటర్‌లో కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. చిలకలపూడిలోని అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన చేశారు. టీడీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. వస్త్రదానాలు చేశారు. **నాగాయలంక :** మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు 74వ జయంతి కార్యక్రమం మంగళవారం నాగాయలంక మత్స్యకారుల భవనం వద్ద జరిగింది. మత్స్యకారులకు ప్రత్యేక గృహనిర్మాణ పథకం, మోపిదేవిలో మత్స్యకార బాలుర ఆశ్రమ పాఠశాల, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు గురుకుల పాఠశాలను ఆయన ఏర్పాటు చేశారన్నారు. తొలుత నడకుదిటి నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, ఎంపిటిసి లంకే శ్రీనివాస్ ప్రసాద్, అంగ్రాజు ఆదినారాయణ, కోలా భిక్షం, సైకం భాస్కరరావు పాల్గొన్నారు.



నడకుదిటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, రామకృష్ణ



గిలకలదిండిలో తాగునీటి సరఫరా పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తదితరులు

నీటి సరఫరా పథకం ప్రారంభం

మచిలీపట్నం టౌన్ : గిలకలదిండిలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి గిలకలదిండి, బందరుకోట ప్రజల దాహార్తిని తీర్చామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గిలకలదిండిలో ఏర్పాటు చేసిన డైరెక్ట్ పంపింగ్ పథకాన్ని మంగళవారం ప్రారంభించారు. డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ కౌన్సిలర్ బచ్చుల అనిల్‌కుమార్, లంకే నారాయణ ప్రసాద్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు నాగరమేష్ తదితరులు పాల్గొన్నారు.

55 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు

పేదల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని రాష్ట్ర గ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద 55 మంది రోగులకు రూ. 21 లక్షల 28 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

నవరాత్రి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : సీఐ



చల్లపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు సూచించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకుంటే పంచాయతీ అనుమతి, ప్రైవేటు స్థలంలో అయితే స్థల యజమాని వద్ద నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవాలన్నారు. ఉత్సవ నిర్వహణ కమిటీ ఏర్పాటు చేసుకోవాలనీ, ఏదైనా సంఘటనలు జరిగితే కమిటీదే పూర్తి బాధ్యత అని స్పష్టంచేశారు. అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. విగ్రహాల ఏర్పాటులో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఉత్సవ పందిరి వద్ద పగలు, రాత్రి తప్పనిసరిగా ఒకరిద్దరు కాపలా ఉండాలన్నారు.అనుమతి తీసుకుని మాత్రమే మైకులు, సౌండ్‌బాక్సులు పెట్టుకోవాలన్నారు. డీజేలకు అనుమతులు లేదన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్యాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విభేదాలకు తావివ్వకుండా శాంతి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో అల్లర్లు, ఘర్షణలకు అవకాశం ఇవ్వకుండా గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సీఐ ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే మండలి

అవనిగడ్డ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పని చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముంపు నివారణ చర్యలను సమీక్షించారు. ఇరిగేషన్ శాఖ చేపట్టిన ముందస్తు చర్యలు అధికారులు వివరించారు. అవుట్‌పాల్ స్లూయిస్ వద్ద సముద్రం నుంచి వరద నీరు డ్రైనేజీల ద్వారా ఎగువకు రాకుండా అడ్డు వేసేందుకు ఇసుక బస్తాలను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల వర్షాలకు 35 చోట్ల పంట కాలువల గట్లు దెబ్బతినగా మ రమ్మతులకు అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెనుమూడి సాయిబాబు, ఇరిగేషన్, డ్రైనేజీ, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖల డీఈఈలు గణపతి, జె.బాబూనాయక్, ఎం.రమేష్, పగడాల సురేష్‌బాబు, ఏడీఏలు జయప్రద, శ్యామల, ఏఈఈలు, హెచ్‌ఓలు, ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామి దేవస్థానం నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఈవో గోపాలరావు

అభయాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్‌గా మట్టా వెంకటేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సుల్తానగరం అభయాంజనేయ స్వామి దేవాలయం పాలకమండలి అధ్యక్షుడిగా మట్టా వెంకటేశ్వరరావు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యవర్గ సభ్యులుగా చెరుకూరి మాధవి, వేముల కోమలాదేవి, రామిదేని రాధాకృష్ణమూర్తి, మల్లెల శ్రీలక్ష్మి, గడ్డం శివకుమారి, కాగిత రాజ్‌కుమార్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని పాలకవర్గాన్ని అభినందించారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, ఈవో కె.వి. గోపాలరావు, టీడీపీ నాయకులు చిట్టిబొమ్మ వనరాజు తదితరులు పాల్గొన్నారు.

బందరు ప్రభుత్వాసుపత్రిలో కేన్సర్ ఓపీ ప్రారంభం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కేన్సర్ చికిత్సకు ఔట్ పేషెంట్ సేవలను సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత మంగళవారం ప్రారంభించారు. డాక్టర్ ఆశాలత మా ట్లాడుతూ, ప్రతి సోమ, గు రువారాల్లో కేన్సర్ రోగులకు ఉచితంగా ఓపీ నిర్వహిస్తున్నామన్నారు. కేన్సర్‌ను ముం దుగా గుర్తించేందుకు యూనిట్ దోహదపడుతుందన్నారు. కేన్సర్ వ్యాధితో ఎక్కువ మంది మహిళలు బాధపడుతున్నారన్నారు. ఇప్పటి వరకు దూర ప్రాంతాలకు వెళ్లే రోగులు ఇకపై ఇక్కడే వైద్యం పొందవచ్చన్నారు. కేన్సర్ రోగులకు ఎన్టీఆర్ వైద్య సౌకర్యం కల్పిస్తామన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసనాయక్, ఆర్ఎంవో నిరంజన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



కేన్సర్ ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత



మాట్లాడుతున్న తెలుగు భాషా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు పైడిపాటి రామ్‌దేవ్

ఆదిభట్ల నారాయణదాసు సేవలు అజరామరం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆదిభట్ల నారాయణదాసు హరికథకు చేసిన సేవలు మరువలేమని న్యాయవాది లంకిశెట్టి బాలాజీ అన్నారు. ఈడేపల్లి ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో తెలుగుబాష సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఆదిభట్ల నారాయణదాసు ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. సమాఖ్య అధ్యక్షుడు పైడిపాటి రామ్‌దేవ్ అధ్యక్షత వహించి మాట్లాడారు. నారాయణదాసు హరికథకు చేసిన కృషిని వివరించారు. సమాఖ్య కార్యదర్శి వై.ఎన్.వి. సురేష్‌బాబు, ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, మడమల రాంబాబు, అప్పినేడి పోతురాజు, అనుమకొండ వెంకటేశ్వరరావు, తోట హనుమంతరావు, మెట్టు ఆదిశేషు, డాక్టర్ దశిక రమేష్ తదితరులు ప్రసంగించారు. ఏలూరు భాగవతారిణి సప్పా భారతి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి హరికథను వీనులవిందుగా గానం చేశారు. వయోలిన్‌పై పాణ్యం దక్షిణామూర్తి, మృదంగంపై కావవరపు సుబ్బారావు సహకరించారు.



మోదీ గద్దె దిగాలని కాంగ్రెస్ కార్యకర్తల ప్రదర్శన

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఓట్ల దొంగ గద్దె దిగు మోదీ గద్దె దిగాలనే నినాదంతో మంగళవారం రాత్రి కోనేరు సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తల ప్రదర్శన నిర్వహించారు. ఒక మనిషి ఒకే ఓటు ఉండాలనే నినాదంతో జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎం.బాబ్జీ, పీసీసీ ప్రధాన కార్యదర్శి, పామర్రు నియోజకవర్గ సమన్వయకర్త మొవ్వ మోహనరావు, మచిలీపట్నం సమన్వయకర్త అబ్దుల్ మతీన్, అవనిగడ్డ సమన్వయకర్త అందే శ్రీరామమూర్తి, పీసీసీ ప్రతినిధి కోకా ఫణిభూషణ్, నాయకులు ఎన్.కుమార్, చిలుకోటి ప్రసాద్, కె. చంద్రశేఖర్, రజియా సుల్తానా పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పూర్వవైభవం తీసుకురావాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో నిర్వీర్యమైన బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని చైర్మన్ కె. బుచ్చిరామప్రసాద్‌ను మచిలీపట్నం బ్రాహ్మణ సంఘాల నాయకులు కోరారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బుచ్చిరామప్రసాద్‌ను మంగళవారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మచిలీపట్నం బ్రాహ్మణ సంఘాల నాయకులు పి.వి.ఫణికుమార్, లొల్లా కుటుంబశాస్త్రి, వేమూరి సాయి, తంగిరాల మిధున వ్యాస్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి కలిసి అభినందించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా పేద బ్రాహ్మణుల పథకాలను పునరుద్ధరించాలని కోరారు.



చైర్మన్ బుచ్చిరామప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న నేతలు



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ఎన్ఆర్ఐ రంగనాథ్‌బాబు

మండలి కృష్ణారావు సేవలు ఆదర్శనీయం : ఎన్ఆర్ఐ

ఘంటసాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు సేవలు ఆదర్శనీయమని ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ్‌బాబు పేర్కొన్నారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి మహోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి ఘంటసాలలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను దుశ్శాలువాతో సత్కరించి ఘంటసాల వారసత్వ సంపద జ్ఞాపికను ఎన్ఆర్ఐ రంగనాథ్‌బాబు అందజేశారు. రంగనాథ్‌బాబు మాట్లాడుతూ 1977లో దివిసీమ ఉప్పెన సమయంలో మండలి వెంకట కృష్ణారావు అన్నార్తులకు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. గొర్రెపాటి విద్యాట్రస్ట్ ప్రతినిధులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, కొండపల్లి రామకృష్ణ, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, నాయకులు మండలి వెంకట్రామ్ (రాజా), బండి పరాత్పరరావు, అయినపూడి భానుప్రకాష్, గొర్రెపాటి సురేష్, కాకుమాని రంగారావు, గొర్రెపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ములపర్రులో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ములపర్రులో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

బంటుమిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ములపర్రులో రూ.20 లక్షల ముడా నిధులతో ఏర్పాటు చేసే పైప్‌లైన్ పనులకు మంగళవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. కాగిత మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తామన్నారు. చోరంపూడి కాలవపై డ్రాప్ పునర్నిర్మించాలని, యూరియా, పొటాష్ ఎరువులు అందుబాటులోకి తేవాలని, ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు. సర్పంచ్ బొడ్డు మంగమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, డీసీ చైర్మన్ బొర్రా కాశీ, నజీర్, రేవు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : విక్కుర్తి

నాగాయలంక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక రేవు వద్ద వరద ఉధృతిని ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. కృష్ణానదికి భారీగా వరద నీరు వస్తుండటంతో లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విక్కుర్తి రామకృష్ణ, పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీనివాసరావు, రేపల్లె ములసయ్య తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి మండలంలో 312 పింఛన్ల తొలగింపు

చల్లపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 312 సామాజిక భద్రతా పింఛన్లను ప్రభుత్వం తొలగించింది. డబ్బు ఆశచూపి వైకల్యం లేకున్నా ఉన్నట్లుగా సదరం క్యాంపుల్లో నకిలీ సర్టిఫికెట్లు తీసుకువచ్చి దొంగ పింఛన్లు పొందుతున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం పింఛన్లను తనిఖీచేసిన సంగతి తెలిసిందే. ప్రత్యేక వైద్య అధికారుల బృందాల ద్వారా తనిఖీల అనంతరం పింఛన్లు తొలగింపు, మార్పులు చేస్తూ వివరాలు వెల్లడించారు. తనిఖీల్లో పొరపాటు జరిగితే ఎంపీడీవోకు అర్జీదాఖలు చేసుకుని, తమ వైకల్యాన్ని నిరూపించుకునేలా ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. మండలంలో తనిఖీ చేసిన 406 పింఛన్లలో 70 మంది పింఛన్‌దారులను వృద్ధాప్య పింఛన్లకు, 24 మందిని వికలాంగ పింఛన్లకు మార్పుచేయగా, 312 మంది పింఛన్లు పూర్తిగా తొలగించారు. లక్ష్మీపురంలోని మూడు సచివాలయాల్లో 100 మంది పింఛన్లు తొలగించారు. ఆ తర్వాత అధికంగా చల్లపల్లిలో 49, మంగళాపురంలో 48, మాజేరులో 39, పాగోలులో 14, నడకుదురులో 31, పురిటిగడ్డలో ఐదు, యార్లగడ్డలో 11, వక్కలగడ్డలో 11, ఆముదార్లంకలో నాలుగు చొప్పున తొలగించారు.

ఆధార్ కార్డుల జారీకి ఎస్టీల గుర్తింపు



పెడనరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ కార్డులు లేకపోవటంతో ఎస్టీలు అనేక సంక్షేమ పథకాలు కోల్పోతున్నారని, అటువంటి వారిని గుర్తించి ఆధార్ నమోదుకు సిఫారసు చేస్తున్నామని తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ అన్నారు. పెడన, ముచ్చర్ల గ్రామాల్లో ఆధార్ కార్డులు లేని 15 ఎస్టీ కుటుంబాలను గుర్తించామన్నారు. మండలంలో ఇప్పటి వరకు 105 మందికి ఆధార్ కార్డులు ఇవ్వడం జరిగిం దన్నారు.

మంతెన సత్యనారాయణరాజుకు గోవర్ధన్ అభినందన



అవనిగడ్డ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు కార్యక్రమాల సమన్వయకర్తగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ మం తెన సత్యనారాయణ రాజును టీడీపీ సీనియర్ నాయకుడు బొబ్బా గోవర్ధన్ మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ అభ్యున్నతి కోసం మంతెన సత్యనారాయణరాజు చేసిన కృషి కారణంగానే సమన్వయకర్త పదవి వరించిందన్నారు. మరిన్ని విజయాలు సాధించాలని బొబ్బా ఆకాంక్షించారు.

రైతుల సేవలో పీఏసీఎస్‌ల పాత్ర కీలకం

కోడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఆర్థిక సహాయం అందించటంలో పీఏసీఎస్‌లు కీలక పాత్ర పోషిస్తాయని కోడూరు కేడీసీసీ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. లింగారెడ్డిపాలెం పీఏసీఎస్ వద్ద చైర్మన్ కోట సుబ్బారావు చేతుల మీదుగా రూ.18,60,000 రుణాల చెక్కులు రైతులకు అందించారు. పీఏసీఎస్ చైర్మన్ కోట సుబ్బారావును రైతులు సత్కరించి అభినందనలు తెలియజేశారు. సర్పంచ్ యర్రంశెట్టి శ్రీదుర్గా, యర్రంశెట్టి దామోదర్‌రావు, సూపర్‌వైజర్ పూర్ణచంద్రరావు, బ్యాంక్ సీఈవో చిట్టిప్రోలు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.



రుణాలు అందజేస్తున్న కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు, కోట సుబ్బారావు

ఎంపీడీవో సుబ్బారావుకు సత్కారం



ఘంటసాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ నుంచి ఉత్తమ అధికారులుగా ప్రశంసాపత్రాలు అందుకున్న ఎంపీడీవో డి.సుబ్బారావు, విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్‌లను మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకాకుళం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏఈ రవికుమార్, లైన్‌మెన్ గంగాధర్‌లను టీడీపీ నేత తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) ఘనంగా సత్కరించారు. కూటమి నేతలు శీలం శ్రీనివాస్, దాసం రామకృష్ణ, కొండవీటి నాని, తమ్మన పవన్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మచిలీపట్నం డివిజన్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేత చిలంకుర్తి శేషు కోరారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ సెంటర్‌లోని దాగూరే విగ్రహానికి చిలంకుర్తి శేషుతో పాటు సంఘ కోశాధికారి శ్రీరామ్, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, శివరామప్రసాద్, సుధీర్, తేజ, వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. మచిలీపట్నం డివిజన్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనానికి స్థలం కేటాయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు.

భూముల రీ సర్వేపై రైతుల హర్షం

కోడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వేపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఇన్‌చార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి తెలిపారు. పిట్టలంక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించారు. తాజా సర్వే ఆధారంగా రూపొందించిన డ్రాఫ్ట్ ఆర్‌వోఆర్‌ను రైతులకు చదివి వినిపించారు. రైతుల సందేహాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ కనగాల వెం కటేశ్వరరావు, రీ సర్వే డీటీ పద్మప్రియ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సుభాషిణి, వీఆర్వో ఒ డుగు గోపాలకృష్ణ, సర్వేయర్లు శ్రీనివాస్, చిరు వర్ధన్, పీఏసీఎస్ అధ్యక్షుడు మర్రే గంగయ్య, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బంగారు మంగళసూత్రాలు

పెడన, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : బల్లిపర్రు గ్రామ ప్రముఖుడు కూనపరెడ్డి వెంకట సుబ్బారావు, సుబ్బలక్ష్మి దంపతుల కుమార్తె సాయి చందు, కుమారుడు సాయిచరణ్‌తేజ మంగళవారం పట్టణంలోని ముత్యాలమ్మ తల్లికి ఆరు గ్రాముల బంగారు మంగళసూత్రాలను సమర్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు తోట పైడేశ్వరరావు, తోట నాగరాజులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

మోపిదేవి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచ క్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని చల్లపల్లి సీఐ ఈశ్వరరావు సూచించారు. మోపిదేవివార్పు టోల్‌ప్లాజా సమీపంలో వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులను ఆపి హెల్మెట్ వినియోగించాలని వివరించారు. మోపిదేవి ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి పసుపుకొమ్ముల అర్చన

నాగాయలంక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాగాయలంకలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా అర్ధనారీశ్వరుడైన రామలింగేశ్వరస్వామికి 108 కిలోల పసుపు కొమ్ములతో విశేషార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు కౌశిక్ భక్తులు తెచ్చిన పసుపు కొమ్ములతో పూజ చేశారు. శ్రీరామ పాదక్షేత్రం ఆలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలోకి నీరు రావటంతో భక్తులు దూరం నుంచే దర్శించుకున్నారు.

రాయితీపై జొన్న విత్తనాల పంపిణీ

పెడన రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎన్‌సిహెచ్ నర్సింహులు పెడన పశుసంవర్ధక శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పాడి రైతులకు రాయితీపై జొన్న విత్తనాలను అందజేశారు. సంచాలకులు డాక్టర్ కె బాబురావు పాల్గొన్నారు.

కొమ్మారెడ్డి విద్యార్థి దీక్షిత్ ప్రతిభ



బంటుమిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో జరిగిన కరాటే పోటీల్లో కొమ్మారెడ్డి విద్యార్థి టి.దీక్షిత్ కటా విభాగంలో ప్రథమ స్థానం సాధించాడు. దీక్షిత్‌ను స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ శోభ, యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరిణి, హెచ్ఎం శ్రీనివాసరావు, కరాటే కోచ్ ఎస్ వెంకటేశ్వరరావు అభినందించారు.